మాస్టర్ పార్వతీకుమార్

# సంఘనీతి

సంఘనీతి

# సంఘనీతి

(విదుర బోధామృతము)

## మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

**సంఘనీతి**

ప్రథమ ముద్రణ : 2010 గురుపూజలు

ప్రతులు : 500

వెల : రూ॥ **75-00**

*ప్రాప్తిస్థానము :*

**జగద్గురు మందిరము**
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్'
14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.
e-mail : dhanishta@rediffmail.com

*ముద్రణ :*

ఎక్సేలియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం – 530 016.
☏ 0891-2747320.

# ధనిష్ఠ
## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా

పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ,

అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితము లకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# ముందుమాట

విదురుడు భారత కాలమునాటి మహాపురుషులలో ఒకడు. అతడు ధర్మస్వరూపుడు. ధర్మమే అంశావతారముగ దిగివచ్చిన వాడు. యమము ధర్మమునకు పుట్టినిల్లు. యముడు సృష్టియందు ధర్మపాలకుడు. విదురుడెరుగని ధర్మము లేదు. అతడు ధృతరాష్ట్రునకు కోరినపుడెల్ల సమయా సమయములు పాటింపక ధర్మ సూక్ష్మములను వివరించెను. ధృతరాష్ట్రుని హితము కోరినవాడు విదురుడు. అందువలన ధర్మ స్వరూపమును ఎప్పటికప్పుడు ధృతరాష్ట్రునియందు ఆవిష్కరించు చుండెడివాడు. ధృతరాష్ట్రుడు కేవలము మమకారము కారణముగ ధర్మమును పాటింపలేదు. విదురుడు చెప్పని ధర్మము లేదు. ధృతరాష్ట్రుడు ఆచరించినది లేదు. వినని శ్రోతకు త్రికరణ

శుద్ధిగ ధర్మమును ప్రేమతో వివరించుట సాధ్యమగు విషయము కాదు. ధృతరాష్ట్రునకు విదురుడు చెప్పిన ధర్మమే *'విదుర నీతిగ'* లోకమున ప్రసిద్ధి గాంచినది. వ్యాసునికి జన్మించిన ముగ్గురు తనయులలో విదురుడొక్కడే స్థితప్రజ్ఞుడు. తన తండ్రి జన్మించినట్లే తాను కూడ చిత్రముగ జన్మించినాడు. దివ్యత్వము దిగివచ్చుటకు మానవు డేర్పరచుకొను ప్రమాణము పనికిరాదని విదురుని జన్మమున మరియొకమారు నిరూపింపబడినది. వర్ణములు, వర్ణాశ్రమ ధర్మములు, జాతినిబట్టి గాక గుణమును కర్మమును బట్టి నిర్ణయించవలెనని దైవము గీతలో తెలిపినాడు.

ధర్మస్వరూపము తనకు తానుగ దిగివచ్చి విదురుని ముఖమున ఉచ్చరింపబడినది. పామరులకు సహితము అర్థమగురీతిలో వివరింపబడినవి.

మహాత్ముడగు విదురుడు నేటికి కూడ భూమిమీద యున్నాడని, భగవంతుని ప్రణాళికలో తనయొక్క కర్తవ్య మును నిర్వర్తించు చున్నాడని విజ్ఞులు విశ్వసించుచున్నారు. శ్రీకృష్ణుని నిర్యాణ సమయమున దైవము తన చరమోప దేశమును మైత్రేయ మహర్షికి, ఉద్ధవునకు అందించెను. వారిరువురిని కలియుగాంతము వరకు భూమిపై నుండి జీవులకు తరింపు మార్గము నందించుడని శాసించెను. అంతేకాక ప్రత్యేకించి తన ఉపదేశమును విదురునకు కూడ తెలుపుడని తెలిపెను. అటు పిమ్మట విదురుడు ఉద్ధవుని కలియుట జరిగినది. వాసుదేవుని యందు తన్మయుడై జీవించు ఉద్ధవుడు విదురునకు బోధకు డగుటకు సమ్మతింప లేదు. రసానుభూతియందు మునిగి తేలువారు బోధనలు చేయలేరు. అది వారి పనికూడ కాదు. అందు వలన కృష్ణ సంకల్పము నిర్వర్తింపబడుటకు విదురుని,

ఉద్ధవుడు మైత్రేయుని యొద్దకు కొనిపోయెను. మైత్రేయుడు భూమిపై నిలచియున్న సాక్షాత్తు కృష్ణ ప్రజ్ఞయే. కృష్ణ స్పర్శద్వారా, కృష్ణుడైనవాడు మైత్రేయుడు. అతడు సర్వసమర్థుడు. అతడు విదురునికి సృష్టి, దైవము, ధర్మము అను మహత్తర విషయముపై సర్వసందేహములు పరిష్కరించి కృష్ణుడందించిన చరమోపదేశము విదురున కందించెను. నాటి నుండి విదురుడు మైత్రేయ మహర్షితో కలసి దివ్యప్రణాళిక యందు తనవంతు కర్తవ్యమును నిర్వర్తించు చున్నాడు.

ఇట్లు మైత్రేయునితో మరి ఇద్దరు మహాత్ములు కూడ సహకరించుచున్నారు. వారును శ్రీకృష్ణానుగ్రహ మూర్తులే. అందులో మొదటివారు సూర్యవంశపు రాజగు మరువు మహర్షి. రెండవవారు చంద్రవంశపు రాజగు దేవాపి మహర్షి. వీరి వివరములు కూడ భాగవతమున వివరింపబడినవి.

విదురుడు నేటికిని తనవంతు కర్తవ్యముగ సంఘ నిర్మాణము, సంఘ పరివర్తనము, సంఘ నీతి, సంఘ ధర్మములు బోధించుచునే యున్నాడు. ఈ మహర్షుల ఆవాసము లన్నియు హిమాలయములయం దున్నట్లుగ ఇటీవలి కాలమున తెలియవచ్చు చున్నవి.

నీతికి పతనము కలిగినపుడెల్ల మరల దానిని నిల బెట్టుటకు, జాతి నశింపకుండ కాపాడబడుటకు విదురనీతి మరల మరల వ్యక్తమగు చుండును.

మా ఈ విదురనీతి ప్రచురణము, నిర్వర్తింపబడు చున్న దివ్యప్రణాళికకు సమర్పితము. ఆంగ్లము నిదివరకే ప్రచురించుట జరిగినది. వివిధ జాతులవారు దీనిని శ్రద్ధగ పఠించుకొనుచున్నారు. ఆంధ్రుల కందుబాటగు రీతిలో, అత్యంత సులభము సరళము అయిన రీతిలో విదురనీతి

మరల ప్రచురించుటకు కారణము జిజ్ఞాసువుల ఆకాంక్షయే. ఆంధ్ర ప్రజలు సచ్చరిత్ర గలవారు. మరల సచ్చరితము వారి జీవితములయందు స్థాపనము కావలెను. అదియే మా ఆరాధన.

రాజమహేంద్రవరము,
7-11-2009
కార్తీక బహుళ పంచమి.

**– పార్వతీకుమార్**

# సంఘనీతి

(విదుర బోధామృతము)

1

తన కన్న బలమైన శత్రువు కలవారు,
ఆస్తిని కోల్పోయినవారు,
కామతృష్ణ కలవారు,
దొంగతనము నందు ఆకాంక్ష కలవారు,
నిదుర పట్టక బాధ పడుదురు.

## 2

తా నెవరో తనకు తెలిసినవాడు,
క్రియ యందు సమర్థత కలవాడు,
ఫలితముల యందు ఆసక్తి లేనివాడు,
ధర్మమునకు కట్టుబడిన వాడు – “జ్ఞాని”.

## 3

కోరిక చేతగాని,
భయము వలన గాని,
దరిద్రము వలన గాని,
ప్రతికూలత వలన గాని,
ఖర్చు వలన గాని,
తాను చేపట్టిన కార్యములను పరిపూర్ణ
మగువఱకు వదలని వాడు – "జ్ఞాని".

## 4

తన బాధ్యతలను ఇతరుల కప్పగించువాడు,
సన్నివేశముల యందు సందేహములు కలుగువాడు,
పనుల యందు ఆలస్యము చేయువాడు – "మూర్ఖుడు".

## 5

అధర్మమగు కోరికలు లేనివాడు,
జరిగిన నష్టముపై శోకింపనివాడు,
ప్రతికూల సన్నివేశముల యందు జ్ఞానమును
మరువని వాడు– "జ్ఞాని".

## 6

తన తప్పులను ఇతరులపైకి నెట్టువాడు,

మితిలేని కోపము కలవాడు,

ఇతరులను అపార్థము చేసుకొనువాడు – “మూర్ఖుడు”.

## 7

చిన్న విషయములను సైతము శ్రద్ధగా మన్నించువాడు,
ప్రేమ జ్ఞానములను మేళవించి సేవ చేయువాడు,
సత్కార్యముల యందు వ్యక్తిగతమైన లాభము కోరనివాడు,
అడుగనిదే మాటాడని వాడు,
అన్ని వేళలా అప్రమత్తుడై వుండువాడు– “జ్ఞాని”.

## 8

పిలువని పేరంటమునకు పోవువాడు,

అడుగకయే మాటాడువాడు,

ఎక్కువగ మాటాడువాడు,

నమ్మకూడని వారిని నమ్మువాడు – "మూర్ఖుడు".

## 9

వినయముగ ధర్మము ననుసరించువాడు,
ఆర్థిక విషయమున గాని,
కుటుంబ విషయమున గాని,
సంఘపరమగు కార్యములయందు గాని,
ధర్మమును వీడనివాడు ,
ధర్మమే కొలబద్ధగా సన్నివేశముల యందు
నిర్ణయము చేయువాడు – “జ్ఞాని”.

## 10

పితృదేవతలను అశ్రద్ధ చేయువాడు,

దేవతలను పూజింపని వాడు,

స్నేహితులను మరచువాడు – "మూర్ఖుడు".

## 11

తనని తాను పొగడుకొనని వాడు,
దంభము లేనివాడు,
కోపమును నియమించువాడు,
సభ్యత కలవాడు,
ఉద్వేగము లేనివాడు – "జ్ఞాని."

## 12

కర్తవ్యమును మరచువాడు,

ఇతరుల పనియందు ఆసక్తి చూపువాడు,

స్నేహితునికి నష్టము కలిగించువాడు – “మూర్ఖుడు.”

## 13

సతతము సత్కర్మల నొనర్చువాడు,
వ్యర్థమగు పనులు చేయనివాడు,
నాస్తికతను బోధింపనివాడు,
శ్రద్ధాభక్తులు కలిగియున్నవాడు – "జ్ఞాని".

## 14

ఆచరణ తక్కువ, ఆలోచన ఎక్కువ కలవాడు,
తాను నిర్వర్తించుచున్న పనుల యందు
పరిపూర్ణమైన అవగాహన లేనివాడు,
అక్రమ మార్గమున ఆర్జనము చేయువాడు - "మూర్ఖుడు".

## 15

మౌనముగ సత్కార్యములను నిర్వర్తించువాడు,
సత్కర్మలు రహస్యముగ నొనర్చువాడు,
వాగ్దానములను, ప్రతిజ్ఞలను చేయక
తత్కర్మలను నిర్వర్తించువాడు,
తన ఆచరణమే తన సందేశముగ
నందించువాడు – “జ్ఞాని”.

## 16

దుష్టులను చేరదీయువాడు,
శిష్టులయందు అశ్రద్ధ కలవాడు,
తనకన్న బలము కలవానిని ఎదిరించువాడు – “మూర్ఖుడు”.

## 17

ఇతరుల స్వభావము నెరిగినవాడు,
కాలము నిర్దేశించు కార్యము నెరిగినవాడు,
నిపుణతతో తత్కార్యము నిర్వర్తించువాడు,
దివ్య ప్రణాళికకు సమర్పణము చెందువాడు – “జ్ఞాని”.

## 18

క్షమి కాలక్రమమున సమస్తమును జయించగలడు.
క్షమికి అసాధ్యమైన దేమియు లేదు.
శస్త్రాస్త్రముల కన్నను, దివ్యాస్త్రముల కన్నను కూడ
క్షమ శక్తివంతమైనది.
చల్లని నీరువలె క్షమ ఉద్రేకమును, కోపతాపమును
చల్లార్చివేయ గలదు.
అసహనము దావాగ్నివలె సమస్తమును నశింపజేయును.

## 19

పొగడ్తలకు లొంగనివాడు,
సన్మానమునకు పొంగనివాడు,
నిందలకు కృంగనివాడు,
వ్యతిరేకతకు భయపడనివాడు,
సెలయేరువలె నిర్మలముగ జీవితమును
సాగించువాడు–"జ్ఞాని".

## 20

క్షమ గలవాడు మహా బలవంతుడు.
అతని క్షమ ఇతరులకు భ్రమ గొలుపును.
చేతకానివాడుగ క్షమి కనిపించుచుండును.
క్షమ కారణముగ ఇతరులకు తనపై గల
అభిప్రాయములను కూడ క్షమతో అనుమతించును.
బలహీనునికి క్షమ బలము కలిగించును.
బలవంతునికి క్షమ భూషణమై నిలచును.

## 21

ఇతరుల యోగక్షేమములను పరిరక్షించువాడు,
పరిసరములను తన ప్రశాంతతో వైభవమున వుంచువాడు,
పెద్దల ప్రేమ, అనురాగములను పొందువాడు – “జ్ఞాని”.

## 22

తనకన్న పెద్దవారిని శాసించువాడు,

ఇతర స్త్రీలతో సన్నిహితత్వమును పెంచుకొనువాడు,

లోభిని సేవించువాడు – “మూర్ఖుడు”.

## 23

తన పనిని ఇతరులపై రుద్దువాడు,

సందేహ పడువాడు,

ఆలస్యము చేయువాడు – "మూర్ఖుడు."

## 24

తన కర్తవ్యము తనకు తెలిసినవాడు,
దానిని నిర్వర్తించు సమర్థతను కలవాడు,
ఇతరుల స్వభావముల నెరిగినవాడు – "జ్ఞాని".

## 25

లోకపు పోకడలు తెలిసినవాడు,
దైవస్ఫూర్తి కలవాడు,
వాక్కున చైతన్యము కలవాడు,
వాదనమున పటుత్వము కలవాడు,
శాస్త్రజ్ఞానము కలవాడు – "జ్ఞాని".

## 26

తన్ను తాను ఆహ్వానించుకొనువాడు,
అడుగనిదే చెప్పువాడు,
విశ్వాసము లేనివాడు – "మూర్ఖుడు".

## 27

సంపద సమృద్ధిగా కలిగి ఇతరులకు పంచనివాడు,
మంచి వస్త్రములు తాను మాత్రమే ధరించువాడు,
దేనిని తన్నాశ్రయించిన వారికి పంచనివాడు – "క్రూరుడు".

## 28

ఒకడు పాపము చేయును.
దాని ఫలము పదిమంది అనుభవింతురు.
అట్లనుభవించుటచే
వారు పాప ఫలములనుండి విడివడుదురు.
కాని పాపము చేసినవానిని
ఆ దోషము వెన్నంటి దుఃఖమున పడద్రోయును.

## 29

నీతిశాలిపై ప్రయోగించిన దుర్నీతి
శాపమై ప్రయోగించిన వానిని వేధించును.
విలుకాడు వదలిన బాణమునైన తప్పించుకొనవచ్చును కాని
నీతిశాలిపై జరిపిన దురాచారము తప్పించుకొనజాలము.

## 30

శస్త్రము, విషము ఒక్కని మాత్రము జంపును.
దురాలోచన పుట్టించు కల్లోలము
సంఘమును చెరచును.

## 31

ఓర్పుగల వానిని చేతకాని వాడని జనులు తలచుదురు.

ఓర్పు గొప్ప బలము.

శక్తిహీనులకు అది గుణము.

శక్తి గలవానికి అది అలంకారము.

## 32

ఓర్పు లోకమున అన్నింటిని వశపరచును.
ఓర్పుతో సాధ్యము కానిది లేదు.

ఓర్పు అను కత్తిని చేతబట్టిన వానిని
దుర్జను డేమియు చేయలేడు.

ఓర్పు లేనివాడు తన దోషములతో
తననే నశింప జేసుకొనును.

గడ్డిపరక లున్నచోట నిప్పుకణము పడినచో
సమస్తము దగ్ధము కాదా!

## 33

ధర్మము ఉత్తమమైన శ్రేయస్సు కలిగించును.

సహనము ఉత్తమమైన శాంతి నొసగును.

విద్య ఉత్తమమైన తృప్తి నిచ్చును.

అహింస ఉత్తమమైన సుఖము నిచ్చును.

## 34

భూమి మొత్తమున పురుషులలో అథము లిద్దరే.

గృహస్థుడై చేతులు కట్టుకొని కూర్చుండువాడు ఒకడు.

సన్యాసియై సర్వ కార్యములను చేయువాడు మరియొకడు.

పుట్టలోని ప్రాణులను పాము మ్రింగినట్లే
కాల మిద్దరినీ మ్రింగును.

## 35

పరుషముగ పలుకని వాడు.

చెడ్డవారిని మన్నింపనివాడు – “ఉత్తముడు.”

## 36

దరిద్రుడై కోరికలు పెంచుకొనుట,
ఏమియు చేయజాలక కోపించుట-
అను పై రెండును శరీరము నెండగట్టు
రెండు వాడి ములుకులు.

## 37

సమర్థుడై యుండియు సహనము కలవాడు,
దరిద్రుడై యుండియు దాన మొసగువాడు,
స్వర్గమునకు తప్పక చేరుదురు.

## 38

ఆర్జించిన ధనమునకు చేటులు రెండు.

ధర్మమునకు, దానమునకు వినియోగింపకుండుట.

అధర్మమునకు, భోగమునకు వినియోగించుట.

## 39

పరుల సొమ్మును హరించుట,

పర భార్యను స్పృశించుట,

మిత్రులను వదులుకొనుట–

అను మూడు దోషములు

నరుని నాశనమునకు కారణములు.

## 40

మితిమీరిన కామము, క్రోధము, లోభము
అధోగతికి చేర్చు ద్వారములు.

బుద్ధిమంతుడు పై విషయములయందు
మితి కలిగి యుండవలెను.

## 41

దేవతలను, పితృదేవతలను, మహాత్ములను,
సాధువులను పూజించువాడు,
సాధు జంతువులను ఆదరించువాడు
చక్కని కీర్తిని పొందును.

## 42

మిత్రులు, శత్రువులు,
నీపై ఆధారపడి బ్రతుకువారు,
చేసిన దుష్కర్మములు
నీ వెందు బోయినను వెంటనంటి వత్తురు.

## 43

దేవతల సంకల్పము,
బుద్ధిమంతుల మహిమ,
విద్యావంతుల వినయము,
పాపకర్ముల వినాశము,
అప్పటికప్పుడు ఫలముల నొసంగునని తెలియవలయును.

## 44

తల్లి, తండ్రి, గురువు, అగ్ని, ఆత్మ
అను ఐదగ్నులను పట్టుదలతో
మానవుడు సేవింపవలయును.

## 45

పంచేంద్రియములలో ఒక్కటి పట్టు తప్పినను
కుండకు చిల్లు పడినట్లు,
వాహనమునకు చక్ర మూడినట్లు
మనిషికి ప్రజ్ఞ సన్నగిల్లును.

## 46

నిద్ర, సోమరితనము,
భయము, ద్వేషము,
నీరసము, మితిమీరిన ఆలోచనము
అను ఈ ఆరు దోషములు
సంపదను దూరము చేయును.

## 47

బోధ చేయని ఆచార్యుని,
వేదములు చదువని ఋత్విక్కుని,
రక్షింపని రాజును,
అప్రియములు పలుకు ఆలిని,
గ్రామమునందే వుండు గోపాలుని,
అడవికి పోదలచు మంగలిని,
నరుడు తప్పక వదలిపెట్టవలెను.

## 48

సత్యము, దానము,

సోమరితనము లేకుండుట,

అసూయ లేకుండుట,

ఓర్పు, ధైర్యము–

మానవుడు ఎప్పటికిని విడువరాని షడ్గుణములు.

## 49

ప్రియముగ పలికెడు భార్య,
ప్రియమైన భార్య,
ఎప్పుడునూ చెడని ఆరోగ్యము,
ధనముల రాబడి,
వినయవంతుడైన కొడుకు,
ప్రయోజనకరమైన విద్య.
ఈ ఆరును ప్రాణికి సుఖములు కలిగించును.

## 50

గోవుల యెడల, పరహితము యెడల,
వృత్తి యెడల, విద్య యెడల,
భార్య యెడల, శూద్రుని మైత్రి యెడల
ఏమరుపాటు తగదు.
ఏమరచినచో అశాంతి కలుగగలదు.

## 51

శిష్యుడు గురువును మరచుట,
పెండ్లాడిన కొడుకు తల్లిని మరచుట,
మోజు తీరినవారు స్త్రీని మరచుట,
సహాయము పొందినవారు చేసినవారిని మరచుట,
ఏరును దాటినవారు నావను మరచుట,
రోగము కుదిరినవారు వైద్యుని మరచుట–లోక సహజము.

## 52

భయము లేని మనుగడ,
స్వతంత్రమగు బ్రతుకుతెరువు,
మంచివారి స్నేహము,
ఆరోగ్యము,
ఋణము లేకుండుట,
స్వదేశము నందుండుట,
మనుష్యునకు సుఖప్రదములు.

## 53

ఈర్ష్య, దీనత, అసంతృప్తి, క్రోధము,
ఎల్లప్పుడు శంకించుట, పరుల సొమ్ముపై బ్రతుకుట-
ఈ ఆరు లక్షణములు గలవారికి ఎప్పుడూ దుఃఖమే.

## 54

స్త్రీ వ్యామోహము, జూదము, వేట, మద్యపానము,
బిరుసెక్కిన మాట, కఠినమైన దండనము,
ధనమును వ్యర్థముగా వెచ్చించుట
అను ఈ ఏడును వ్యసనములే.

## 55

దైవీ ప్రవృత్తి కలవారిని నిర్లక్ష్యము చేయుట, దూషించుట,
వారితో కలహించుట, వారియందు తప్పులు వెతకుట,
ఇతరులు నిందించుచున్నచో విని ఆనందించుట,
వారికి నమస్కరింపకుండుట చేయువాడు–
తాను పతనము చెందుచున్నానని తెలియచెప్పుచున్నాడు.

## 56

సత్కులము, వినయముతో కూడిన విద్య,
నిగ్రహము, మితముగ పల్కుట,
శక్తికొలది దానము చేయుట,
చేసిన మేలు మరువకుండుట,
ధీరతతో నుండుట అను గుణములు
పురుషుని ప్రకాశింప చేయగలవు.

## 57

ఈ దేహమను ఇంటికి తొమ్మిది ద్వారములు,
మూడు స్తంభములు, ఐదు సాక్షులు కలరు.
దీనియందు పురుషుడు నెలకొని యున్నాడు.
దీని తత్త్వమును చక్కగ ఎరిగినవాడు
అందరిని మించిన కవి.

## 58

మద్యము సేవించువాడు, మరపు గలవాడు, పిచ్చివాడు,
అలసిన వాడు, క్రోధము కలవాడు,
ఆకలి గొన్నవాడు, తొందరపాటు పడువాడు,
అత్యాశ కలవాడు, భయపడిన వాడు, కాముకుడు
ధర్మము లెరుగరు.
సాధకుడు వీరితో సంగతి చేయరాదు.

## 59

పనేమియు లేక భార్యను వదలి విదేశముల కరుగువాడు,
పాపులతో సంధి చేయువాడు,
పర భార్యలను స్పృశించువాడు,
గర్వము, దొంగతనము, లోభితనము
స్వభావమునందు కలవాడు,
మద్యపానమునందు ఆసక్తి కలవాడు సుఖపడడు.

## 60

ఆడంబరమగు వేషధారణము చేయనివాడు,
ఇతరుల కడ తన గొప్పలు చెప్పుకొననివాడు,
కారుకూతలు కూయనివాడు,
లోకమునందు ప్రేమపాత్రు డగును.

## 61

ఒక పని చేయుచుండగ దాని వెంబడి వచ్చు
పనులను, ప్రయోజనములను పరిశీలించవలెను.

పనుల నుండి పనులు పుట్టును,
కావున ప్రయోజనము లేని పనులను ప్రారంభింపరాదు.

ప్రయోజన మనగా జీవుల శ్రేయస్సే కాని
తన శ్రేయస్సు కాదు.

కాని పనులు చేపకు పెట్టిన ఎఱవలె
శోకము కలిగింప గలవు.

## 62

తాను అనుభవించుటకు వీలైనది, యోగ్యమైనది,
మేలు చేయునది యగు
అర్థమును మాత్రమే కోరుకొనుట మేలు.

ఆశకు పోయినచో అడియాశ మిగులును.

త్వర పడినచో పసరుకాయల నుండి
రసమును గ్రోలినట్లుండును.

## 63

ఎన్నటికిని ఫలమునకు రాని పనులను
మానవుడు మొదలిడనే రాదు.
వానియందు చేసిన పురుష ప్రయత్నము వ్యర్థమే.
గొప్ప యత్నము, కొద్ది ఫలితము మూర్ఖతను సూచించును.
కొద్ది యత్నము, గొప్ప ఫలము తెలివిని సూచించును.

## 64

అందందు రాలిపడిన ధాన్యపు గింజలను
అత్యాసక్తితో ఏరుకొను పేదవాని వలె
పెద్దలు చెప్పు సూక్తములను ఏరుకొనుచు,
జీర్ణము చేసుకొనుచు జీవించువాడు శ్రద్ధాళువు.

## 65

ఒత్తిడి లేకయే వంగు దానిని
ఎవ్వరునూ బలవంతముగ వంచరు.

అట్లే సహజముగ ధర్మము నాచరించు వారిని
ఎవ్వరునూ వంచలేరు.

వంపు తిరిగిన కడ్డీకి ఎవ్వరునూ నిప్పు చూపరు కదా!

వినయముచే వంగిన వానిని అహంకారి ఏమి చేయగలడు?

## 66

పరుల ధనమునకు, రూపమునకు,
బలమునకు, కులమునకు,
సుఖమునకు, సౌభాగ్యమునకు,
సత్కారమునకు ఈర్ష్య చెందువాని రోగమునకు
అంతము లేదు.

## 67

విద్య, ధనము, వంశము–
సంస్కారిని ప్రకాశింప జేయును.
కుసంస్కారికి మదము కలిగించును.
సజ్జనులకు సజ్జనులే గతి.
సజ్జనులకు దుర్జను లెన్నటికిని గతి కాజాలరు.

## 68

పురుషునకు శీలము ముఖ్యము.
ఈ లోకమున అది నశించిన వాడు
బ్రతికి సాధించున దేమియును లేదు.
వానికి ధనము కాని చుట్టములు కాని
చేయునది ఏమియు లేదు.

## 69

మనస్సును గెలువక నీవారిని గెలుచుట కుదరదు.
నీ వారిని గెలువలేని వాడివి
పగవారి నెట్లు గెలువ గలవు?

మనస్సును గెలువని వాడు తనవారిచేత,
పరులచేత కూడ అవమానింపబడును.

వికారము చెందినపుడెల్ల
నీ మనస్సునకు చక్కని శిక్షణ మిచ్చుచుండుము.

చెదరని మనస్సుగల మనుజుని
శ్రీదేవి వదలక అంటిపెట్టుకొని వుండును.

## 70

చెదరని మనస్సు బుద్ధిగ నిలచును.
బుద్ధితో ఆత్మను తెలియవచ్చును.
ఆత్మయే ఆత్మకు బంధువు.
కాని చెదిరిన మనస్సునకు
ఆత్మయే ఆత్మకు శత్రువు సుమా!

## 71

సన్నని రంధ్రములు గల వలను కొరికివేసి
పెద్ద చేపలు బైటపడిన విధమున
కామ క్రోధములు, వివేకము అను అలను ఛేదించి,
జీవుని  పతనము కావించగలవు.

## 72

శాశ్వతమైన సుఖము, వృద్ధి
కావలె ననుకొనువాడు
అర్థ సముపార్జనమును
ధర్మసమ్మతముగ చేయవలెను.

## 73

వినికిడి, చూపు, రుచి, స్పర్శలను
గెలువని వానికి
అవియే శత్రువులై రూపు మాపగలవు.

## 74

ఐశ్వర్యము, విలాసములపై ఆసక్తికి దారి చూపును.
విలాసములు ఇంద్రియములపై పట్టు తప్పించును.
ఎంత బలవంతుడైనను విలాసముల కారణమున నశించును.
కావున ఐశ్వర్యమును యజ్ఞార్థముగ వినియోగించుట
ఒక్కటియే శ్రేయోమార్గము.

## 75

అనసూయత్వము, సూటిగా ప్రవర్తించుట,
శుచిగ నుండుట, ప్రియముగ పల్కుట,
సంతోషముగ నుండుట, చంచలత లేకుండుట
దురాత్ములకు పట్టుపడవు.

## 76

స్థిరత్వము, సుఖ దుఃఖములను సహించుట,
ధర్మము తప్పకుండుట, మాట నిలబెట్టుకొనుట
నీచులకు వీలుపడదు.

## 77

కఠినముగ మాట్లాడుట, నిందలు వేయుట
అను రెండు పనులు హింస యగును.
వీని వలన పాప మంటును.
నింద పడినవానిని పాపము విడిచి
నింద చేయువానిని చేరును.

## 78

గుణవంతులకు ఓర్పు బలము,
స్త్రీలకు సేవ బలము,
రాజులకు ధర్మ దండనము బలము,
దుర్జనులకు హింస బలము.

## 79

గొడ్డలితో నరికినను చెట్టు మరల చిగుర్చ కలదు.

కొడవలితో కోసినను తోట మరల పెరుగ గలదు.

కాని కారుకూతలతో చెడినది మాత్రము మరల బాగుపడదు.

## 80

శూలముతో గుచ్చినను,
బాణములతో కొట్టినను
వానిని శరీరము నుండి పెకలించ వచ్చును.
ములుకు పలుకులు
అట్లు వెలికి తీయుటకు వీలు పడదు.
అవి గుండెలలో గుచ్చుకొనును కదా!

## 81

కొందరి నోటినుండి వచ్చు పలుకులు
వాడి ములుకులవలె ఇతరులను బాధించును.
అట్లు దెబ్బతిన్నవాడు రేయింబవళ్ళు శోకించును.
కావున తెలిసినవారు మాటలను ప్రయోగింప రాదు.

## 82

బుద్ధి మలిన మైనప్పుడు,
పతనము దాపురించినపుడు
అవినీతి నీతి వలె కనిపించును.

## 83

ధర్మమును పాటించువారు
ధర్మమును పాటించని వారిని జాలితో భరింతురే కాని
హృదయమున అంగీకరింపరు.

84

పుణ్య తీర్థములందు స్నానమాడుట కన్న
ప్రాణులయందు సమబుద్ధి కలిగియుండుట
మిన్న యగును.

## 85

మనుష్యుని కీర్తి
ఈ లోకమున కొనియాడబడినంత కాలము
అతడు స్వర్గలోకమున నిలచి యుండగలడు.

## 86

అసత్యము లాడువాడు ముందు తరముల వారిని కూడ
ఊర్ధ్వ లోకములనుండి పతితులను చేయగలడు.
(ఈ కారణముగనే శ్రీరాముడు, దశరథుని
మాటను నిలబెట్టుటకు దృఢ నిశ్చయు డయ్యెను.)

## 87

సంపాదన విషయమున అసత్యము లాడువాడు–
పుట్టిన వారిని, పుట్టబోవు వారిని కూడ
అదృష్టహీనులుగ చేయగలడు.

## 88

భూమి కొఱకు అసత్య మాడువాడు,
తన వారి కొఱకు అసత్య మాడువాడు-
తనవారితో సహా నశించును.

## 89

దేవతలు గొల్లవానివలె కఱ్ఱ పట్టుకొని రక్షించరు.

వారెవరిని రక్షింప జూతురో

వారి బుద్ధిబలము పెంచుదురు.

మానవుడు తన బుద్ధిబలముననే

తనను రక్షించుకొనవలెను.

అందులకే దేవతా ప్రార్థనము.

## 90

మనుజునకు తన భావమందలి పవిత్రతయే రక్ష.
మరియొక విధమైన రక్షణకు అవకాశము లేదు.
సతతము భావములను
పవిత్రముగ నుంచుకొనుటకు
ప్రయత్నము చేయవలెను.

## 91

కపటము, మోసము
స్వభావమునందు వుండువానిని
వేదములు త్వరితముగ వదలిపోవును.

## 92

మద్యము త్రాగుట, ఇతరులపై పగ,
భార్యాభర్తలను విడదీయుట,
దేశమునకు ద్రోహము చేయుట
అను వానిని వదలుట శ్రేయస్కరము.

## 93

భక్తిశ్రద్ధలతో చేయు అర్చనము,
మౌనము, స్వాధ్యాయము, సత్కర్మాచరణము
అభయమును ప్రసాదింప గలవు.

## 94

ధర్మము నడవడిచే తెలియును.
మంచితనము వ్యవహారముచే తెలియును.
ధీరత్వము కష్టములో తెలియును.
శూరత్వము భయ సమయములో తెలియును.
మిత్రుడెవరో ఆపదలలో తెలియును.

## 95

ముసలితనము రూపమును హరించును.
ఆశ ధైర్యమును హరించును.
అసూయ ధర్మమును హరించును.
క్రోధము సంపదను హరించును.
నీచుల సేవ శీలమును హరించును.
కామము సిగ్గును హరించును.
మృత్యువు ప్రాణమును హరించును.
దురభిమానము సర్వమును హరించును.

## 96

శుభ కార్యములు సంపదలను పుట్టించును.
నేర్పువలన సంపదలు పెరుగును.
సమర్థత వలన సంపద కుదురు చేసుకొనును.
మిడిసి పడకుండుట వలన స్థిరముగ నుండును.

## 97

మంచి కులమున జన్మించుట,
మితముగ పలుకుట,
శక్తిమేరకు దానము చేయుట,
చేసిన మేలు మరువకుండుట–
పై గుణములు మనుజుని ప్రకాశింప చేయును.

## 98

యజ్ఞము, దానము, తపస్సు, అధ్యయనము
సత్పురుషులను అంటిపెట్టుకొని యుండును.
సత్పురుషులు నిగ్రహమును, సత్యమును,
ఋజువర్తనమును, దయను
అంటిపెట్టుకొని యుందురు.

## 99

ధర్మమార్గ మనగ యజ్ఞము చేయుట,
వేదములను అధ్యయనము చేయుట,
దానము చేయుట, తపస్సు చేయుట,
సత్యమును పలుకుట, ఓర్పు కలిగియుండుట,
జీవులపై జాలి కలిగియుండుట మరియు అత్యాశ లేకుండుట.
పై ఎనిమిది గుణములలో మొదటి నాలుగు
లోకము మెప్పు కొరకు ఆచరించినను,
తుది నాలుగింటిని కపటు లాచరింపలేరు.

## 100

వృద్ధులు లేని  సభ సభకాదు.
ధర్మము చెప్పనివారు వృద్ధులు కారు.
సత్యము లేనిది ధర్మము కాదు.
కపటముతో కూడినచో అది సత్యము కాదు.
సత్యము వలన ధర్మము, ధర్మము వలన వృద్ధత్వము,
అట్టి వృద్ధత్వము వలన సభ రాణించగలవు.

## 101

సత్యము, రూపము, విద్య,
మంచి కులమున పుట్టుట,
శీలము, బలము, ధనము, పరాక్రమము,
తెలివైన పలుకు ఈ పదియును స్వర్గ కారణములు.

## 102

మిక్కుటమగు కోరికలను సన్యసించినవాడు,
కోపమును నిగ్రహించుకొను శక్తి కలవాడు,
సూక్ష్మమైన విచక్షణా జ్ఞానము గలవాడు,
సంపదను సద్వినియోగము చేయువాడు,
శాస్త్రజ్ఞానము కలవాడు,
కర్తవ్యములయందు ఆలస్యము చేయనివాడు
చక్కని ధర్మాధికారి.
అనగా మంచి పరిపాలకుడు.

# 103

ప్రజల విశ్వాసము చూరగొనువాడు,
ధర్మాధర్మ నిర్ణయము చేసి, అధర్మమును శిక్షించువాడు,
క్షమా గుణమును ప్రదర్శించువాడు,
క్షమించువాడు చక్కని ధర్మాధికారి.

## 104

బలహీనులను హేళన చేయనివాడు,
కష్ట సమయములలో ఓర్పు వహించువాడు,
తనకన్న బలవంతులను ఎదిరించక మైత్రి చేసుకొనువాడు,
అధర్మమును నిర్జించువాడు చక్కని ధర్మాధికారి.

## 105

ప్రతికూల సన్నివేశములకు క్రుంగక
ఆత్మబలమున కొనసాగు వాడు,
కష్టనష్టముల కోర్చువాడు,
అనుకూల సమయమును వినియోగించుకొనువాడు,
సుఖముల యందు పొంగనివాడు చక్కని ధర్మాధికారి.

## 106

నిష్కారణముగ కుటుంబమును వదలువాడు,
కూడనివారితో మైత్రి చేయువాడు,
స్త్రీ సాంగత్యమునకై తపించువాడు,
దురభిమానము కలవాడు,
మత్తు పదార్థములకు లొంగినవాడు
భ్రష్టుడైన ధర్మాధికారి.

## 107

కోపము కారణముగ కార్యములు చేయనివాడు,
వాక్కున సత్యమునే పలుక నేర్చినవాడు,
మిత్రులతో వాదించనివాడు,
ఇతరులు హేళన చేసినపుడు ఆగ్రహించనివాడు,
సమభావము కలవాడు, ఇతరులను దూషింపనివాడు,
తనకు తానుగ శత్రుత్వము వహించని వాడు,
వాఙ్నియమము కలవాడు,
ఘర్షణల యందు ఓర్పు ప్రదర్శించువాడు
చక్కని ధర్మాధికారి.

## 108

వేషభాషలయందు దర్పము లేనివాడు,
ఆత్మస్తుతి, పరనింద చేయనివాడు
లోకమున ప్రేమపాత్రుడు.

## 109

శత్రుత్వమును పెంపొందింపనివాడు,
ప్రవర్తనమున గర్వము చూపనివాడు,
కర్తవ్యమును విస్మరించనివాడు,
ప్రతికూల సంఘటనల యందు కూడ
ధర్మమును వీడనివాడు – ఆర్యుడు.

## 110

ఇతరుల కష్టనష్టములను చూచి సంతసింపనివాడు,
తన విజయములకు పొంగనివాడు,
దానము నిచ్చి మరచువాడు - ఆర్యుడు.

111

ప్రతినిత్యము దైవారాధనము చేయువాడు,
దైనందినముగ దానములు చేయువాడు,
దైవ సహాయము కలిగి యుండును.

## 112

స్నేహమును పెంచుకొనువాడు,
ఇచ్చి - పుచ్చుకొనుట తెలిసినవాడు,
సంస్కారవంతులతో సంభాషణ చేయువాడు,
కుసంస్కారులను ప్రోత్సహించనివాడు,
పెద్దలను అనుసరించువాడు బుద్ధిమంతుడు.

## 113

ఆశ్రయించినవారికి అవసరములు తీర్చువాడు,
వ్యక్తిగత అవసరములను మితముగ నుంచువాడు,
ఎక్కువ నిద్రపోనివాడు,
పనియందుత్సాహము కలవాడు,
అపకారికియైనను ఉపకారము చేయువాడు బుద్ధిమంతుడు.

## 114

సత్సంకల్పములు కలవాడు,
వానిని నిర్వర్తించు నిర్దిష్టము,
స్పష్టము అయిన మనో ప్రణాళిక కలవాడు,
నిశ్శబ్దముగ వానిని నిర్వర్తించువాడు బుద్ధిమంతుడు.

## 115

తన తప్పులకు పశ్చాత్తాపము నొందువాడు,
తన మనస్సును దివ్యత్వమునకు అర్పించి
స్థిరముగ నిలచువాడు,
మనో వైశాల్యము కలిగినవాడు, బుద్ధిమంతుడు.

## 116

ఇతరుల శ్రేయస్సునకై పాటుపడువాడు,
సాధుస్వభావము కలవాడు,
సత్యమును ప్రియముగ పలుకువాడు,
ఉదాత్తమైన భావములు కలవాడు బుద్ధిమంతుడు.
అతడు మనుష్యులలో మణివలె వెలుగొందును.

## 117

ఆశ రాబోవు దుఃఖమునకు ఎఱ వంటిది.

చేప ఎఱను ఆహార మనుకొనియే గదా చిక్కుకొనుచున్నది!

ఆశ వలన జీవుడు చిక్కులకు తగులుకొనును.

దురాశ కలిగినచో ఏమి జరుగునో ఇక చెప్పనేల!

## 118

సంపద పెరిగి, సంస్కారము పెరగనిచో
ఆ సంపద దుష్ప్రవర్తనమునకు దారితీయును.
దుష్ప్రవర్తనము సంపదను నశింపజేయును.
ముసలితనము యౌవనమును కొల్లగొట్టినట్లే,
దుష్ప్రవర్తనము సంపదను కొల్లగొట్టును.

## 119

మనసున కుతంత్రములు చేయకుడు.
వక్ర మార్గముల తాత్కాలిక సుఖములకై ప్రాకులాడకుము.
తాత్కాలిక నష్టములకు వ్యధ చెందకుము.
వర్తమాన కాలమున జరుపు కార్యముల ఫలితములు
భవిష్యత్తు నందు ఎట్లు కలుగునో యోచింపుము.
ముందు రాబోవు దుఃఖములకు
ప్రస్తుతమున పునాది వేయకుము.

## 120

సంఘము ఆమోదించు పనులు చేయుటవలన
వ్యక్తి సుఖముగ నుండగలడు.
దేహము ఆమోదించు ఆహారము మాత్రమే
భుజించుట వలన దేహి సుఖముగ నుండగలడు.

## 121

పండని పండు రస మివ్వదు.
విజ్ఞత లేని పని ఫలితము నివ్వదు.
పండిన పండు రస మిచ్చుటయే గాక,
భవిష్యత్తునకు విత్తనమును కూడ నిచ్చును.
ఆ విత్తనము వందల పండ్ల నిచ్చును.
అట్లు పండ్లు శాశ్వతముగ ఆనందము నందించును.
అట్లే విజ్ఞతతో కూడిన పనులు శ్రేయస్సు నిచ్చుటయే గాక,
శ్రేయోదాయకములగు అనేక పనులకు స్ఫూర్తి నిచ్చును.
శాశ్వతముగ శ్రేయస్సు నిలచును.

## 122

తేనెటీగ పుష్పమునుండి తేనెను మధురముగ గొనును.
పుష్పమునకు బాధ కలిగించదు.
బుద్ధిమంతుడు తన అనుచరుల నుండి
మధురముగ సహకారము గొనును.
అనుచరులకు కూడ మధురత్వమే అందించును.
అతడే యుక్తిపరుడు.
అతడే ప్రేమమూర్తి.
రాముడు శిలలు మోయించినను
కోతు లానంద పడినవి.
శ్రమ యనుకొనలేదు.
అదియే రాముని ప్రేమ.

## 123

ఆలోచన లేని పని మూర్ఖత.
చేసిన పనికి ఫలితములను ఆశించుట,
ఫలితములు చేదుగ నున్నచో తప్పించుకొనుట అవివేకము.
హింస, అసత్యభాషణము, దొంగతనము, పరధన,
దార అభిలాష నిర్వర్తించినవారు
వాని ఫలితములను పొందుదురు.
అందివచ్చు ఫలితములను అంగీకరించి
పరిష్కరించుకొనువాడు నిజమగు బుద్ధిమంతుడు.
తప్పించుకొనుచు మడత పేచీలు పెట్టువాడు
తన మడతలలో తానే బంధింపబడును.

## 124

ఫలితములు లేని పనిచేయుట అవివేకము.
పండ్లు, పూవులు యివ్వని చెట్లు నాటుట నిరుపయోగము.

*

నిరుపేదయగు పురుషుని పెండ్లియాడుట,
కోపిష్ఠి యగు గురువును సేవించుట అవివేకము.

*

సమత్వమున్నవాని కనుల నుండి
ప్రేమ, వెలుగు ప్రకాశ మగుచుండును.

## 125

ఫలితములు లేని బండచాకిరికన్న,
సద్యోఫలితము నిచ్చు చిన్నపనులు మేలు.
తెలివైన రైతు తక్కువ శ్రమతో
ఎక్కువ విలువైన పంటను పండించుకొనును.

*

గర్వపోతు తనను తాను సమర్థించుకొనుచుండును.

*

నీతిలేని ఉద్యోగి తనను తానే పాడుచేసుకొనును.
మంటలో పడిన చర్మము మడతలు పడదా?

# 126

జ్ఞానము ప్రదర్శన కొరకు కాదు. అది చేతల యందు,
మాట యందు మెఱపువలె వ్యక్తమగును.

*

జ్ఞాన ప్రదర్శన నిరుపయోగము
మరియు దుర్వినియోగమునకు అవకాశమిచ్చును.

*

పండిన పండెప్పుడును ఆకుల చాటు నుండుట
గమనించితివా? సృష్టిలోని ఈ రహస్యము తెలియుము.

## 127

భయముతో మనుషులను వశపరచుకొనుట
పాశవికము, అపాయకరము కూడ.
తిరుగుబాటుకు అవకాశ మెప్పుడును ఉండును.

*

ప్రేమకు అన్నియు వశపడును.
అందు బాధ్యతతో కూడిన స్వతంత్రముండును.
తిరుగుబాటుకు అవకాశ ముండదు.

## 128

పిత్రార్జితము సంక్రమించిన అది ఒక మహత్తరమైన బాధ్యత.
అందు గర్వపడుటకన్న బాధ్యత పడుట మిన్న.
గర్వపడువాడు పిత్రార్జితమును హరింప చేయును.
బాధ్యత పడువాడు దానిని వైభవోపేతముగ వృద్ధి చేయును.

## 129

రాజ్యము, ఆస్తి, సంపద సక్రమముగ పొందినచో నిలచును.
వానిని సక్రమముగ నిర్వర్తించుచున్నచో పెరుగును.
క్రమము తప్పినచో తరుగును. అదృశ్యమగును గూడ.
అక్రమముగ పొందిన,
బాధలు కొనితెచ్చుటయేగాక అదృశ్యమగును.

## 130

ఆర్జించుటకన్న సక్రమముగ వినియోగించుటకు

ఎక్కువ తెలివి కావలెను.

తెలివి గలవాడు మట్టి నుండి బంగారము పుట్టించ గలడు.

సోమరిచే పని చేయించగలడు,

స్వార్థపరునిచే సత్కార్యములు చేయించగలడు.

అతని కేదియు వ్యర్థము కాదు.

అతని దృష్టిలో వ్యర్థులు లేరు.

వినియోగము తెలిసినవానికి వ్యర్థమను పదము లేదు.

## 131

ప్రకృతి విలువలు తెలిసినవాడు
ప్రకృతి నుండి సమస్తము పొందుచున్నాడు.
పొలములో మిగిలిన ధాన్యపు గింజలను పక్షి పోగుచేసుకొని
తన పిల్లలను పోషించుకొనుచున్నది.
అట్లే పెద్దల నీతి వాక్యములను గ్రహించి
బుద్ధిమంతుడు బాగుపడుచున్నాడు.
సంగ్రహించుటకు గాని,
గ్రహించుటకు గాని ఓర్పు అవసరము.

## 132

యోగి జ్ఞాన మాధారముగ జీవించును.
రాజు గూఢచారు లాధారముగ జీవించును.
వ్యాపారి ధన మాధారముగ జీవించును.
ఇతరులు దొరికిన దానిపై ఆధారపడుదురు.

## 133

జరుగుచున్నది సమ్మతము కానపుడు జీవుడు బాధపడును.
జరుగుచున్నది మార్పునకు వీలుపడనపుడు
అంగీకరించుటయే మేలు.
మార్పు చేసుకొనుట కవకాశ మున్నపుడు
మార్పు చేసుకొన వచ్చును.
అవకాశమే లేని మార్పు విధి అని గుర్తింపవలెను.

## 134

నీ వద్ద నున్న సంపద ఇతరుల కొరకే.
నిరాకరించుట వలన దుఃఖము కలుగును.
నీ వద్ద గల విద్య ఇతరుల కొరకే.
బోధించకున్నచో దుఃఖము కలుగును.
గోవు పొదుగునందు పాలు ఇతరుల కొరకే.
అందింపనిచో బాధకు గురియగును.
పై రహస్యము తెలిసినచో సుఖించగలవు.

## 135

ధర్మమునకు లొంగినవానిని
కాలము అనుగ్రహించును.

ధర్మమునకు లొంగనివానిని
కాలము క్రమముగ లొంగదీయును.

వంగని యినుప చువ్వను వేడిచేసి వంచుట లేదా?

అట్లే ధర్మమునకు లొంగనివానిని
కాలమే కష్టనష్టముల ద్వారా వంచును.

## 136

పశువులకు వర్షపు మేఘము మిత్రుడు.
రాజునకు మంత్రియే మిత్రుడు.
గురువునకు జ్ఞానమే మిత్రుడు.
భార్యకు భర్తయే మిత్రుడు.

## 137

సత్యము, ధర్మము, ఆచరణాత్మక జ్ఞానము,
సత్సంఘములు రక్షణ స్థావరములు.

*

ధాన్యమునకు గాదె, పశువునకు పోషణము,
స్త్రీకి ఋతుధర్మము రక్షణ స్థావరములు.

## 138

దుఃఖమునకుగాని, సుఖమునకుగాని
నడతయే ఆధారము.

*

రాజునకుగాని, పేదకుగాని నడవడికయే
సుఖదుఃఖములకు కారణము.

*

స్వామిత్వమునకుగాని, దాసత్వమునకు గాని
నడవడికయే ఆధారము.

## 139

అసూయాపరునికి ఆత్మశాంతి లేదు.
అరిషడ్వర్గములలో అసూయను జయించినచో
మిగిలిన అంతఃశత్రువులుగూడ దూర మగుదురు.

*

ఆభరణముల వలన కొందరికి అందము చేకూరును.
కొందరి అందమే వారికాభరణము.
అట్టివారు ఆభరణములకు గూడ
అందము చేకూర్చగలరు.

## 140

ధర్మపరుని వద్ద సంపద,
జ్ఞానము చేరినచో అవి ప్రకాశింపగలవు.
డంబాచారులకు సంపద,
జ్ఞానము కేవలము భుజకీర్తుల వంటివే.

141

అల్పబుద్ధి వానికి సహాయ మొనర్చిన
సద్బుద్ధిపరుడు మౌనముగ నుండును.
అల్ప బుద్ధివాడే సహాయ మొనర్చిన అధికముగ వాగును.
బుద్ధిపరులు సహాయము పొందుటకు
అల్పబుద్ధుల నాశ్రయింపరు.

## 142

ధర్మపరులు ధర్మపరులపైననే ఆధార పడవలెను.

అధర్మము నాచరించు వారిపై ఆధార పడరాదు.

సత్సాధకులకు సద్గురువెంత ఆవశ్యకమో

సద్గురువునకు గూడ సత్సాధకుడంతే ఆవశ్యకము.

అత్యవసరమైననూ ధర్మాత్ముడు
అధర్మపరుల నాశ్రయింప రాదు.

## 143

సంఘము గుర్తింపు వేషభాషలనుండి లభించును.

ప్రపంచముపై స్వామిత్వము
దైవానుసంధానముచే లభించును.

పురోభివృద్ధి సన్మార్గమున లభించును.

సత్ప్రవర్తనమున సర్వమును లభించును.

## 144

సత్ప్రవర్తనము జీవనమునకు చుక్కాని వంటిది.
కాలక్రమమున సత్ప్రవర్తనుడు సమస్తమును పొందును.
సత్ప్రవర్తనము లేనివాడు జీవన్మృతుడే.

## 145

సమయమునకు పరిశుద్ధము, రుచికరము, పోషకము అగు
భోజనము లభించువాడే ధనికుడు.
దానికొరకు పాటు పడువాడు దరిద్రుడు.

## 146

షడ్రసోపేతమైన భోజనము భుజించుటకు సదుపాయమున్నను
తగిన జీర్ణశక్తి లేక ధనికుడు భుజింపలేడు.
సమృద్ధమగు జీర్ణశక్తి యున్ననూ దరిద్రుడు భుజింపలేడు.
జీర్ణశక్తి యున్నచోట ఆహార లేమి,
ఆహార మున్నచోట జీర్ణశక్తి లేమి
సృష్టియందు చూచు విచిత్రము.
రెండు సన్నివేశములకు సత్ప్రవర్తన లేమియే కారణము.

## 147

ధనవంతునికి దారిద్ర్య భయము
దరిద్రునికి ఆకలి భయము
సంస్కారికి అపకీర్తి భయము
అందరికిని చావు భయము.

## 148

మదము లన్నిటియందును ధనమదము దుష్టము.
ధన మదాంధుడు తప్పక నశించును.

# 149

చిదాకాశ చైతన్యమున గ్రహ సంచారము
వివిధ తరంగముల నేర్పరుచును.
అట్లే జీవచైతన్యమును త్రిగుణములు, యింద్రియములు
వాని ప్రవర్తనద్వారా తరంగములను సృష్టించును.
తరంగముల తాకిడి కతీతముగ నున్నచో
జీవచైతన్యమును అనుభవింప వచ్చును.

## 150

జీవచైతన్యము ఇంద్రియముల నుండి
ఇంద్రియార్థముల వైపుకు ప్రసరించినపుడు
జీవునకు ఘర్షణ కలుగుట సహజము.

బుద్ధితో వివేకించి నియమిత మార్గముల
ప్రసరింప జేసినచో శాంతి యుండును.

ఆకాశము నిర్మలము, నిశ్చలము, ప్రశాంతము అయినను
దానియందు తిరుగాడు గ్రహములు
ఆకాశ తరంగములను భూమి కందించునపుడు
ఘర్షణాత్మక తరంగములు తప్పవు.

## 151

జీవుడు ఇంద్రియార్థములకు బానిస అయినపుడు
జీవ చైతన్యము నీరసించును.
ఇంద్రియములు బలపడును.
జీవుని పలువిధములుగ తమయందు బంధించి వేయును.
ఐదు గుఱ్ఱముల రథము ఐదు దిక్కులకు
గుఱ్ఱములచే లాగబడగ రథము చెడి రథికు డిబ్బంది పడినట్లే,
ఇంద్రియములకు లోబడిన జీవుడు మరల మరల నశించును.

## 152

రాజగురువుల సలహాను పాటింపని రాజు

కాలక్రమమున నశించగలడు.

అట్లే బుద్ధి తెలుపు విషయములను వినని మనస్సు

కాలక్రమమున జీవుని నశింపజేయును.

## 153

దైవము పాదపద్మములను స్థిరముగ నాశ్రయించుము.
అపుడు దివ్యచైతన్యము నీ మనసునందు ప్రవేశించును.

చైతన్యస్ఫూర్తి కలిగిన మనస్సు ఇంద్రియములను,
శరీరమును నియమించ గలదు.

ఇట్లు ప్రపంచమున నీకు నిజమగు స్నేహితుడు
దైవమే అని ఎరుగుము.

## 154

బుద్ధిమంతులకు ధర్మము చట్టముగ భాసించును.
వారు సహజముగ ధర్మమునే ఆచరింతురు.
బుద్ధిహీనులలకు చట్టమొక బంధము.
మితిమీరిన కోరిక, కోపము, చట్టమును వ్యతిరేకించు బుద్ధి,
ఉగ్రవాదము, బుద్ధిహీనతను పెంచి
ధర్మమును వ్యతిరేకింప చేయును.

## 155

ఇంద్రియార్థములకు లొంగిన జీవుడు
లోశత్రువులచే జయింపబడినవాడు.
అట్టివానిని బైట శత్రువులు సులభముగ జయింతురు.

## 156

కుళ్ళిన పళ్ళతో కలిసిన మంచి పండు కూడ కుళ్ళును.
అట్లే దుష్టుల సాంగత్యమున మంచివాడు చెడును.
ఇది సత్యము.

## 157

స్వార్థపరులకు అసూయ స్నేహితుడు.
(అట్లే సుయోధనునకు కర్ణుడు స్నేహితుడు.)
అతడికి కుటిలత్వము సలహాదారు. (అతడే శకుని.)
స్వార్థపరుని పొగడుచు నుండువాడు స్వార్థమును పెంచును.
(అతడు దుశ్శాసనుడు.)
ఇవి దుష్టచతుష్టయములు.

## 158

భయము, అశాంతి, అపనమ్మకము, లోభత్వము, అజ్ఞానము,
అధర్మము స్వార్థపరుని ఆరుగురు మిత్రులు.
ఈ షడ్గుణములు స్వార్థపరుని
నశింపజేయు వరకును పనిచేయును.

## 159

పరుషమగు వాక్కు హింసయే.
విమర్శ కూడ హింసయే.
హింసించువాడు కాలక్రమమున హింసింపబడును.
హింసను సహించినవాడు అహింస యందు పెరుగును.
క్రమముగ శాంతిని పొందును.
దివ్య చైతన్యమునకు చేరువగును.
హింసను మౌనముగ సహించుటయే అహింసా మార్గము.
ఇది ధర్మజుని మార్గము.

# 160

దుష్టుని బలము దుష్టత్వము.
ప్రభువు బలము సక్రమపాలన.
స్త్రీ బలము సహనము (ఓర్పు).
తెలివికి బలము సద్గుణములు.

## 161

మనిషికి గాయమైనచో కాలక్రమమున గాయము మానును.

మనసుకు గాయమైనచో ఆ గాయము

జీవితాంతము వరకు మాయదు.

మానవుడు మాటలతో చేయు గాయములు

అస్త్రములకన్న పరుషములు.

ప్రియభాషణము చేతకానివారు

మౌనము వహించుట మేలు.

162

అన్ని ఆధ్యాత్మిక సాధనలకన్న సమభావము మిన్న.
సమభావము కలవాడు సమస్తాన్నీ జయిస్తాడు.

## 163

భర్త ప్రేమను కోల్పోయిన స్త్రీ,
ధనము కోల్పోయిన జూదగాడు,
మాటను కోల్పోయిన మానవంతుడు నిదురించలేరు.

## 164

ధనమునకై ధర్మమును విడచిన మానవుడు
కాలగతిన సమస్తమును కోల్పోగలడు.
అతడు జీవితమున నశించుట తథ్యము.

## 165

దేవతలకు, గురువునకు వ్యత్యాసమున్నది.
దేవతలు ధర్మపరుని రక్షింతురు.
అధర్మపరుని వీడుదురు.
సద్గురువట్లు కాక అధర్మపరుని కూడ
ధర్మపరునిగ తీర్చిదిద్ది రక్షించును.

## 166

సమస్త కార్యములకు సత్సంకల్పములు ఆధారమైనచో
మానవునకు శాంతి దక్కును. లేనిచో అశాంతియే.
శాంతము లేక సౌఖ్యము లేదు.

## 167

మనసు యందు, మాట యందు మడతలు కలవారు
వేదములు వల్లించిననూ, శాస్త్రములు పఠించిననూ,
సద్గ్రంథ శ్రవణము గావించిననూ సుఖము లేదు.
అట్టివానికి పతనము తప్పదు.

## 168

పోరాడు బుద్ధి, తీవ్రమగు పగ, స్పర్థను పెంచు గుణము,
ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపములు,
మద్యపానము,
సోదరుల నడుమ భేదమును పుట్టించుట-
వర్జనీయమగు కార్యములు.

## 169

జ్ఞానవంతుని మత్సర మావరించుట
వెలుగును చీకటి క్రమ్ముట వంటిదే.
సాయం సంధ్యయందు చీకటి వెలుగును మ్రింగినట్లు
జ్ఞానవంతుని మత్సరమను చీకటి మ్రింగును.

## 170

హస్త సాముద్రికవేత్త, దొంగవ్యాపారి,
మూఢ విశ్వాసములు కలవాడు,
శత్రువు, స్నేహితుడు, నటుడు, వైద్యుడు
న్యాయస్థానమందు సాక్షులుగ నిలచుట సముచితము కాదు.

# 171

మంత్ర మననము, అగ్నికార్యము, శాస్త్ర పఠనము,
సత్కార్యములు రక్షణ పొందుటకు సాధనములు.
కాని డాంబికముగ ప్రచారమునకై చేసినచో
మనిషి యందు స్పర్థ పెరుగును.

## 172

ఇళ్లకు నిప్పు పెట్టువాడు,
ఇతరుల మనస్సులయందు విషము కల్పించువాడు,
విద్యను అమ్ముకొనువాడు,
పదునైన ఆయుధములు తయారుచేయువాడు,
స్పర్థను పెంచువాడు,
విశ్వసించిన వానిని మోసము చేయువాడు,
స్త్రీల నవమానించువాడు,
గర్భస్రావములు గావింపువాడు – శిక్షార్హులు.

## 173

గురుపత్నిని కామించినవాడు,
ఇతరులను అదేపనిగ బాధ పెట్టువాడు,
సద్గ్రంథములను తూలనాడు వాడు,
లంచగొండియైన అధికారి,
గాయత్రిని గానము చేయని బ్రాహ్మణుడు,
రక్షింపని క్షత్రియుడు- నేరస్తులు.
వీరు శిక్షార్హులు.

## 174

చీకటియందు కనుపింపచేయునది అగ్ని.
ప్రవర్తన యందు విశదమగునది ధర్మము.
చేతలయందు ఆవిష్కరింపబడునది సత్సంకల్పము.
అపాయమునందు అవతరించునది ధైర్యము.
కష్టముల యందు తెలియబడునది ప్రశాంతత.
అత్యవసరమున నిలబడునది స్నేహము.
ఇట్లాయా సమయములందు
ఆయా గుణములు తెలియబడును.
కేవలము మాటల వలన గుణములు తెలియబడవు.

## 175

ముసలితనము దేహసౌందర్యమును హరించును.
దురాశ స్థిరత్వమును హరించును.
మరణము ప్రాణమును హరించును.
అసూయ ధర్మ ప్రవర్తనను హరించును.
కోపము సంపదలను హరించును.
నీచుల సన్నిహితత్వము శీలమును హరించును.
కోరిక సంస్కారములను హరించును.
గర్వము అన్నిటినీ హరించును.

## 176

సత్సంపద పుణ్యకార్యములను ఆవాహనము చేయును.
ఇతర సంపదలు పాపకార్యములను పుట్టించును.
సత్సంపదకు విద్య, సంస్కారము బలమై నిలచును.
సత్కార్యములు సత్సంపదలను స్థిరపరచును.
వినయము, పరహితము
సంపదలను శాశ్వతముగ నిలబెట్టును.

## 177

సంస్కారయుతమైన కుటుంబమున జన్మము,
శ్రద్ధతో కూడిన విద్యాభ్యాసము, మృదువైన భాషణము,
దానబుద్ధి, మనోనిగ్రహము, కృతజ్ఞతా భావము,
ధైర్యము- మానవుని ప్రకాశవంతము చేయగలవు.

## 178

సత్సంకల్పము గలవానికి సద్బుద్ధి, ఉదారత,
స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము చేరువగును.
అట్టివాడు మనోనిగ్రహము, ధర్మప్రవర్తనము, సమభావము,
క్షమ ప్రయత్నించి సాధించుకొనవలెను.
ఇందు మొదటి నాలుగును సంఘమున
కీర్తి కొరకై కొందరు నటింతురు.
అట్టివారికి మిగిలిన నాలుగు గుణములు అసాధ్యములు.

## 179

విజ్ఞత లేని సభ- సభ కాదు.
ధర్మములేని విజ్ఞత- విజ్ఞత కాదు.
సత్యము లేని ధర్మము- ధర్మము కాదు.
సత్యము లేనిచోట యుండునది మోసము మాత్రమే.

## 180

సంస్కారయుతమైన కుటుంబమున జన్మము
రూప సౌందర్యము,
ప్రవర్తనమున సత్యము,
శాస్త్ర పఠనము,
ఆత్మపరిశీలనము, సత్శీలము,
మనోబలము, ధైర్యము,
మృదుభాషణ, సత్సంపద గల
జీవనము స్వర్గ జీవనము.
అట్టివానికి భూతల జీవనము స్వర్గము.

## 181

సత్కార్యములు సత్ఫలముల నిచ్చును.
దుష్కార్యములు దుష్ఫలముల నిచ్చును.
దుష్కార్యముల వలన విచక్షణ సన్నగిల్లును.
దుష్కార్యముల వలన కర్త క్రమముగ నశించును.
సత్కార్యములు విచక్షణను పెంచును.
పెరిగిన విచక్షణ వికాసమునకు దారితీయును.
వికాసము ఆకాశపు వెలుగున స్థితి కల్పించును.

## 182

అసూయ, పగ, హింసించుట,
నొప్పి కలుగునట్లు మాటాడుట,
మోసము పాపస్థానములు.

## 183

బుద్ధిమంతులు మహాత్ములనుండి జ్ఞానమును బడసి
దైవ మార్గమున పయనింతురు.
బుద్ధిహీనులు మహాత్ములనుండి ఇతరములగు ఐహిక
విషయములను పొందుచు, అజ్ఞానముననే వసింతురు.

## 184

దినమంతయు ధర్మాచరణతో జీవించు సత్పురుషుడు
రాత్రి సమయమున సుఖముగ, సులభముగ నిద్రించగలడు.

ధర్మాచరణము వర్షాకాలమునందు ఛత్రము వంటిది.

మధ్యవయసున నొనరించిన సత్కార్యములు,
ధర్మాచరణము వృద్ధాప్యమున సుఖమగు జీవనము నిచ్చును.

ఆజన్మమూ ధర్మాచరణము గావించువానికి మరణించిన
వెనుక గూడ సుఖము, ఆనందము యుండును.

ధర్మాచరణము దైవసాన్నిధ్యము నందించుచుండును.
సాన్నిధ్యమునకు ధర్మాచరణమే ప్రధానము.

## 185

ఆహారమునకు అరుగుదలయే ప్రధానము.

స్త్రీకి శీలమే ప్రధానము.

వీరునకు జయమే ప్రధానము.

సత్సాధకునకు సిద్ధియే ప్రధానము.

అట్టివారే గౌరవనీయులు.

## 186

అన్యాయార్జితమగు ధనము, సంపద
జీవితమున కలత కలిగించును.
జీవన యానము అస్తవ్యస్తమగును.

# 187

చట్టము ననుసరించని వానిని రాజు శిక్షించును.

ధర్మచట్టము ననుసరించని వానిని యముడు శిక్షించును.

నిర్మలమగు హృదయము గలవానిని సద్గురువు నడిపించును.

ధర్మచట్టము ననుసరించని వానిని
సద్గురువైనను నడిపింపలేడు.

## 188

స్త్రీ ఆలోచన, ఋషీంద్రుల శక్తి, మహాత్ముల జ్ఞానము,
నదీప్రవాహము అంచనాల కతీతముగ నుండును.

## 189

ఏ రాజు మహాత్ములను గౌరవించునో,
కోశాగార సంపద సమముగ వితరణ గావించునో,
సభయందు ధర్మము ననుసరించునో,
రాజ్యమునందు సుఖశాంతులు వర్ధిల్లజేయునో,
ఆ రాజు కలకాలము రాజ్యము నేలగలడు.

## 190

రక్షణ చేయు రాజు,
బోధన చేయు గురువు,
సేవల నందించు సేవకుడు,
నామమాత్రపు లాభముతో వ్యాపారము చేయు వైద్యుడు-
భువియను ఉద్యానవనమున
బంగారు పూవులను పొందుదురు.

## 191

కర్మలు నాలుగు రకములు.
శరీరముతో చేయునవి,
ఇంద్రియములతో చేయునవి,
మనస్సుతో చేయునవి
మరియు బుద్ధితో చేయునవి.
ఇందొకదానికన్న మరియొకటి
అదే క్రమమున శ్రేష్ఠమైనది.

# 192

మహాత్ముల గూర్చి
నాలుగు ప్రధాన గుణములు తెలుపబడినవి.

1. సంకల్పసిద్ధి, 2. శాంతము,
3. ధర్మప్రవర్తనము, 4. సమత్వము.

ఇవి మహాత్ములయందే గోచరింపబడును.

## 193

ఇతరుల దుష్ప్రవర్తనము
మహాత్మునిపై ప్రభావము చూపదు.

దుష్ప్రవర్తనము గావించిన వానిని,
అది తిరిగి వచ్చి బాధించును.

మహాత్ము లద్దమువంటి వారు. స్వచ్ఛమైనవారు.

## 194

మహాత్ము లెవ్వరిని నిందింపరు.

తమను తాము పొగడుకొనరు.

వారి భాషణము స్పర్ధను కలిగించదు; పెంచదు.

పరుషవాక్యము వారినుండి వెలువడదు.

## 195

పరుషవాక్యములు హృదయ స్పందనమునకు
భేదము కలిగించును. ప్రాణమును కలత పరచును.
నరములయందు ఉద్రిక్తతను పెంచును.
పరుషవాక్యము విషసంబంధము.

## 196

కఠిన హృదయులు, పరుష భాషణులు,
అవమానము గావించువారు,
హృదయములేని తీవ్ర విచికిత్స చేయువారు
మానవులలో ఆటవికులు.
అధోశ్రేణికి చెందినవారు.

## 197

దుష్టుల మాటలను, చేతనలను
సత్పురుషులు మౌనముగ స్వీకరింతురు.
తత్కారణముగ దుష్టులు బలహీనపడుదురు.

## 198

సాంగత్యములు వాసనా బలములను పెంచును.
సత్పురుషుల సాంగత్యము సుగంధమువలె
శుభ వాసనలను పెంచును.
దుష్టుల సాంగత్యము దుర్గంధమువలె
అశుభ వాసనలను పెంచును.
సత్సాధకునితో సాంగత్యము సద్భావనలను పెంచును.
సద్గురువుతో సాంగత్యము సత్యదర్శనమునకు స్ఫూర్తి నిచ్చును.

## 199

బాధ్యతారహితమైన మాట, చేత నీనుండుద్భవింపరాదు.
ఎంత వత్తిడియందైనను క్షమయే బలమును కలిగించును.
క్షమ కలిగినవానిని ఆహ్వానించుటకై
స్వర్గద్వారములు తెరుచుకొని వేచియుండును సుమా!

## 200

భాషణముకన్న మౌనము మిన్న.

మౌనము కన్న సత్యభాషణము మిన్న.

సత్యభాషణము ప్రియభాషణమైనచో మరింత మిన్న.

ప్రియభాషణమునకై సత్యము నశ్రద్ధ చేయుట
భాషణా పాపము.

## 201

నీ వే భావ మెక్కువగ తలచుచుందువో
ఆ భావమే నిన్ను నడిపించుచుండును.
నీ భావము నందలి పరిశుభ్రతయే నీకు రక్ష!

## 202

ఆకర్షణ - వికర్షణ అనునవి కవలల వంటివి.
దేనిని గూర్చి ఆకర్షణ యుండవలెనో
దేనిని గూర్చి వికర్షణ యుండవలెనో
తెలియుట జ్ఞానము. అట్లాచరించువాడే "జ్ఞాని"

ఆకర్షణ - వికర్షణములు తాత్కాలికము,
శాశ్వతములు అని రెండు రకములు.
దివ్యమును గూర్చి ఆకర్షణ,
పాపమునుగూర్చి వికర్షణ శాశ్వతములు.

## 203

సముద్రై చలించువానికి
గెలుచుట – నోడుట, బొగడ్త – అవమానము,
సుఖము – దుఃఖము, శత్రువు – మిత్రుడు
అని ప్రత్యేకముగ నుండదు.
ఏలనన్న అతడందరియం దొకటిగ నుండును.

## 204

తనని తాను నమ్మనివాడు యితరులను నమ్మడు.
సత్యమును నమ్మనివాడు శాస్త్రములను నమ్మలేడు.
దైవమును నమ్మనివాడు ధర్మమును నమ్మలేడు.
నమ్మనివాడు తనకు తానుగ నశించును.

## 205

నమ్మినవారిని మోసము చేయనివాడు,
పెద్దలకు సేవ చేయువాడు,
ప్రేమతో కూడిన అవగాహన కలవాడు,
ఋజు ప్రవర్తనము కలవాడు దైవ సమానుడు.

## 206

తక్కువ సంస్కారముగల మనిషిని వివాహమాడుట వలన,
దాన ధర్మాదులు చేయకపోవుటవలన,
ధర్మమునందు విముఖత వలన,
శాస్త్రములం దశ్రద్ధ వలన,
సంపద దుర్వినియోగము చేయుట వలన,
ఉపాధ్యాయుని, గురువుని ధిక్కరించుట వలన,
పెద్దలను అవమానించుట వలన
మానవుడు పతనము చెందును.

## 207

సత్పురుషుల సేవ వలనను,
సద్గ్రంథముల పఠనము వలనను,
సంపదల సద్వినియోగము వలనను,
మనసునకు క్రమశిక్షణ కలుగును.

## 208

సత్ప్రవర్తనము ద్వారా దీర్ఘకాలమున పొందు సంపద
స్థిరమై తృప్తిని కలిగించును.

బుద్ధిమంతుడు సత్ప్రవర్తనను ప్రయత్నించి
కాపాడుకొనవలెను.

సంపదలను, కీర్తిని కాపాడుకొన యత్నించుట అవివేకము.

సత్ప్రవర్తనను కాపాడుకొనుట వివేకము.

## 209

సత్ప్రవర్తన లేనివాని సంపద, కీర్తి, జ్ఞానము
కరి మ్రింగిన వెలగపండువలె అపహరింపబడును.

*

సత్పురుషుల యెడల, సాధువుల యెడల
కఠిన స్వభావము కలవానిని దరి చేరనీయకుండుట శ్రేష్ఠము.
అట్టివాడు నిన్ను పతనము గావింపగలడు.

## 210

సత్పురుషులు జీవుల శ్రేయస్సుకొరకు మాత్రమే జీవింతురు.

*

ఓర్పు గుణములలో కెల్ల రాజువంటిది.

## 211

స్నేహమునకు విశ్వాసము ప్రాణము.
భయము, అనుమానము స్నేహమునకు శత్రువులు.
నమ్మకములేని సంబంధము నేతిబీరకాయలోని నేయివంటిది.

*

చపలచిత్తుడు, పెద్దలను గౌరవింపనివాడు,
విచక్షణా రహితుడు, స్నేహమును నిలబెట్టుకొనలేడు.

## 212

విషయలోలుడు, చపలచిత్తుడు, మూర్ఖుడు
సంపదను నిలబెట్టుకొనజాలడు.
కాలక్రమమున అతడన్నిటిని చేజార్చును.

## 213

మేఘములు కదలు మార్గ మెవ్వరును ఊహించలేరు.
అవి గాలివాటున కదలుచుండును.
మూర్ఖుల ప్రవర్తన కూడ గాలివాటు ప్రవర్తనమే.
వారెప్పు డనుగ్రహింతురో, ఎపు డాగ్రహింతురో
ఎవ్వరికిని తెలియదు.
అట్టి మూర్ఖులకు దూరముగ నుండుట మేలు.

## 214

మనసునందు ఘర్షణ పెరిగినచో
అది ప్రాణమును బలహీన పరచును.
జ్ఞానమును కొడిగట్టించును.
రోగమును పోషించును.
రూపమున కళ నపహరించును.

## 215

శోకము వలన కోల్పోయినది రాదు.
శోకము దేహమును దహించుచుండును.
నీ శోకము నీవు గిట్టనివారి కానందము కలిగించును.
శోకమున బడుటకన్న అవివేక మేమియు లేదు.

## 216

మానవు డనేకమార్లు జన్మించును.

అనేకమార్లు మరణించును.

అనేక జన్మలలో హాని వృద్ధులను చవిచూచును.

కొన్ని జన్మలలో పొందుట నేర్చును.

మరికొన్ని జన్మలలో పంచుట నేర్చును.

ఇతరులను గూర్చి దుఃఖపడును.

ఇతరులు తనను గూర్చి దుఃఖపడుట అనుభవించును.

సుఖము – దుఃఖము, లాభము – నష్టము, జననము – మరణము వీనినెవ్వరు తప్పించుకొనజాలరు.

కావున సుఖమునకు పొంగుట,

దుఃఖమునకు క్రుంగుట అవివేకము.

## 217

జ్ఞాన మార్గమున ఆరు బిలము లున్నవి.
అందు పడినచో జీవుడు మరల మొదటికే వచ్చును.
ఈ ఆరును వైకుంఠపాళి యందలి పాముల వంటివి.
ఐదు ఇంద్రియార్థములు, అహంకారము
సముపార్జించిన జ్ఞానమును మ్రింగివేయుచు నుండును.
వివేకవంతుడు వీని విషయమున జాగరూకుడై యుండవలెను.

## 218

అత్యాశ,
యింద్రియలోలత్వము,
ఆత్మావలోకనము లేకుండుట,
అజ్ఞానము –
ఈ నాలుగు భావము లెచ్చట నుండునో
అచ్చట శాంతి యుండదు.

## 219

భక్తి యున్నచోట భయముండదు.
ధ్యాన మున్నచోట అస్థిరత్వముండదు.
గురు శుశ్రూష యున్నచోట అజ్ఞానముండదు.
యోగమున్నచోట అసమానతలు, అశాంతి యుండదు.

## 220

మోక్షమునకై దానధర్మాదులు చేయుట,
క్రతువులు చేయుట, అధ్యయనము చేయుట,
తీర్థయాత్రలు చేయుట
యిత్యాదివి ఉపకరించవు.
సృష్టియందు ద్వంద్వములు తప్పనిసరి యని ఎరిగి
వాటి నంగీకరించుట నేర్చినచో మోక్షము సిద్ధించగలదు.

## 221

అంతరంగమున ఘర్షణకు కారణము
అస్తవ్యస్తమగు ప్రవర్తనయే.
అట్టి ఘర్షణ యున్నప్పుడు
ఎంత సౌకర్యముగ నున్నను నిద్ర పట్టదు.
ఎంత స్త్రీ సౌఖ్యమున్నను ఆనందముగ నుండదు.
ప్రపంచ మెంత మెచ్చుకొనుచున్నను సంతోషము కలుగదు.
ప్రవర్తనయందు వలసిన మార్పులు చేసుకొనినచో
శాశ్వత సంతోష ముండును.
అట్టి సంతోషమునకు
బహిరంగ సుఖములతో సంబంధమే లేదు.
అవి యున్నను లేకున్నను ఒక్కటియే.

## 222

కుట్ర చేయువాడు స్థిరముగ నుండలేడు,
శాంతిని పొందలేడు,
ధర్మము నాచరింపలేడు,
మనసున అనుమానము పీడించుచుండును.
అట్టివానికి మిత్రవాక్యము చేదుగ నుండును.

## 223

సంపద భూమిని, పాడిపశువులను ఆశ్రయించి యుండును.

జ్ఞానము సద్గురువు నాశ్రయించి యుండును.

చంచలత్వము స్త్రీల నాశ్రయించి యుండును.

భయము అధర్మము నాశ్రయించి యుండును.

## 224

సద్గురువు సముఖమున చేయు విజ్ఞాన ప్రదర్శనము,
స్త్రీల సముఖమున చూపు దర్పము,
స్నేహితుల సముఖమున చేయు ఆత్మస్తుతి,
గోవు సముఖమున చూపు అశ్రద్ధ,
పతన కారణములు.

## 225

వృక్షమెంత యెత్తైనదైనను
ఒంటరిగ నుండుట క్షేమము కాదు.

వృక్ష సమూహమున యుండుట క్షేమము.

అట్లున్నచో గాలి తాకిడి తక్కువగ నుండును.

అట్లే ఎంత గొప్పవాడైనను
ఒంటరియగుట క్షేమము కాదు.

ఒంటరివా డెంత బలవంతుడైనను బలహీనుడే.

బలమైన యొక సర్పము
చలిచీమల గుంపుకన్న బలహీనమైనది.

## 226

సద్గురువులను, స్త్రీలను, శిశువులను, గోవులను,
ఆశ్రయించిన వారిని, బంధువులను,
అతిథి అభ్యాగతులను
అశ్రద్ధ చేయువాడు పతనము చెందును.

## 227

ఆరోగ్యము, సంపద అనునవి
జీవితమను పక్షికి రెండు రెక్కల వంటివి.
అవి బలముగ నున్నచో,
ఆకాశమున నున్న పక్షివలె
జీవితము సుఖ సంతోషములతో నుండును.
సంపద లేనివాడు ఒక రెక్క లేనివాడు.
అత డెగురలేడు.
ఆరోగ్యము లేనివాడు బ్రతుకనే లేడు.
రెండును గలవాడే కలవాడు.

## 228

హృదయ దౌర్బల్యము హీనము.
అది భయంకరమగు రోగముకన్న హీనము.
అట్టివాని జీవితము చాల బరువుగ నుండును.
అట్టివాడు మిత్రుల యందు విముఖుడై యుండును.
ఆనందము దరిచేరినను తోసివేయును.
అన్ని విషయములయందు బిగుసుకొనిపోయి క్షీణించును.
హృదయ దౌర్బల్యము క్షుద్రము.

## 229

అనారోగ్యము దురదృష్టకరము.
అది మనసును, దేహమును పీడించుచు నుండును.
అనారోగ్యము సంపదలను అనుభవించ నీయదు.
విజ్ఞానమునకు అనాసక్తత చూపు మనసు రోగగ్రస్తమైనది.
మనసున గాని దేహమునగాని రోగము చేరనీయకుండుట
ప్రయత్న సాధ్యమని తెలియుము.

## 230

ధర్మము నంగీకరించుటకు మనసు ఉత్సహించుట శ్రేష్ఠము.

ధర్మమును వెనువెంటనే ఆశ్రయించుట మిక్కిలి శ్రేష్ఠము.

ఇతరులను తెలివిగ కొల్లగొట్టుట అధర్మము.

## 231

సాధుజనులను మాయ చేయుట దుష్టము.
అట్టి దుష్టత్వము వలన సంపదలు క్షీణించును.
సాధుజనులను, జీవులను పరిరక్షించువారికి
అదృష్ట ద్వారములు తెరువబడును.

## 232

ధర్మము ననుసరించుటయేగాని
దానిని మనకు తోచినట్లుగ మలచుకొనుట అవివేకము.

ఎంత ప్రయత్నించినను ఇంద్ర ధనుస్సును
నిటారు చేయలేము.

అట్లే సూర్యకిరణమును వంచలేము.

ధర్మము కూడ నట్టిదే.

దాని ననుసరించుటకన్న వేరు మార్గము లేదు.

## 233

పెద్దల నాదేశించుట, విరోధులను సేవించుట,

తన్నుతాను పొగడుకొనుట,

తనకన్న బలవంతు నెదిరించుట దుఃఖ కారణములు.

## 234

తృప్తి లేకపోవుట, స్త్రీల నవమానించుట,
అధర్మపరుల సహాయము కోరుట,
కూడని విషయములపై ఆసక్తి కలిగియుండుట
పరమ దుఃఖమును కలిగించును.

## 235

విముఖులకు సద్బోధ చేయుట,
ఇతరుల భూములయందు విత్తనములు నాటుట,
దుష్టబుద్ధుల నుండి సహాయము కోరుట,
ఇచ్చిన మాట తప్పుట,
దుఃఖమునకు ద్వారములు తెరచుటయే.

## 236

ముల్లును ముల్లుతోనే తీయవలెను.
తంత్రమును తంత్రముతోనే నిర్వీర్యము చేయవలెను.
కుతంత్రమునకు కుతంత్రమే సమాధానము.

## 237

కాముకునకు ఉచ్చ నీచములు లేవు.

## 238

దుష్టుల సేవ శీలమును చెరచును.
స్వార్థపరుడు, కోపిష్ఠి, పొగరుబోతు, గర్వబోతు
సత్కార్యములను చేయలేరు.
అట్టి వారి ఆయుః ప్రమాణము తగ్గుచు నుండును.
సాధుశీలము, దానబుద్ధి, అహింస,
ధర్మము, వినయము, సత్ప్రవర్తనము
ఆయుః ప్రమాణమును పెంచగలవు.

## 239

ప్రియభాషణమునకు మురియుట తగదు.
అందు సత్య ముండవలెను.
సత్యభాషణము ప్రియము కాకున్నను
అంగీకరించుట శ్రేయస్కరము.
కేవలము ప్రియభాషణులను దరి చేరనీయకుము.
సత్యభాషణులను గర్హింపకుము.

## 240

ధర్మము నాచరించువాడు,
కోరిననే సలహాల నిచ్చువాడు,
కొంత పరుషమైనను హితవాక్యము పలుకువాడు,
వైద్యుడు నిజమగు సహాయకులు.

## 241

వ్యక్తికన్న సంఘము ముఖ్యము.
తన సంఘముకన్న గ్రామము ముఖ్యము.
తన గ్రామముకన్న దేశము ముఖ్యము.
తన దేశముకన్న భూగోళము ముఖ్యము.
ఈ క్రమము తెలిసి వర్తించువానిని
కీర్తి, సుఖములు వరించును.

## 242

నరులలో నక్కలు, కుక్కలు, ఎలుకలు,
సింహములు, సర్పములు
యిత్యాది పశు ప్రవృత్తు లుండును.
ప్రవృత్తి నెరిగి స్నేహము చేయుట క్షేమము.

## 243

నరుని విజయములకు,
జ్ఞాని సలహాలు వెన్నువంటివి.
అట్టి జ్ఞాని సలహాలను తక్షణ మాచరించుట మేలు.
జ్ఞాని యనగ సద్గురువే.
అతడు దైవ ప్రతినిధియే.

## 244

నీకు చక్కని సందేశములు,

ఆదేశము లిచ్చుచు,

నీ పురోగతికి తోడ్పడు సలహాదారుని

నీతో సమానముగ గౌరవించుము.

నిర్లక్ష్య మెన్నడును చేయకుము.

## 245

సర్వసమర్థుడు, నిగర్వి, దయగలవాడు,
గంభీరమగు నడవడి గలవాడు,
అనుమానించని బుద్ధి,
అవినీతికి లొంగని శీలము గలవాడు,
నేర్పరి, మాటకారి అగు దూత
సర్వశుభములను చేకూర్చును.

## 246

దుష్టుని ఎదుర్కొనవలసిన సందర్భమున యుక్తి,
కాల మందించు అవకాశము
ప్రధానముగ వాడబడవలెను.
నీతి గలవారి నెదిరించుట కన్న
అవినీతి నెదిరించుటకు
మిక్కిలి అప్రమత్తత కలిగి యుండవలెను.

## 247

స్థిరచిత్తము లేని రాజు,
శీలము లేని స్త్రీ,
పదభ్రష్టుడైన ఉద్యోగి
సరియగు నిర్ణయములకు తోడ్పడలేరు.
వారి ఆలోచనలను,
వారి అసమర్థత కప్పివేయును.

## 248

ఉభయ సంధ్యలయందు స్నాన మాచరించుట,
సద్భాషణము, చక్కని స్పర్శజ్ఞానము,
నిర్మలత్వము, సున్నితత్వము, స్నేహభావము,
స్త్రీల విశ్వాసమును చూరగొనుట
విజయ కారణములు.

249

చక్కని ఆహార నియమము గలవానికి ఆరోగ్యము,

ఆయుర్దాయము, బలము,

దేహమునందు సుఖము లభించును.

అట్టి వాని సంతతిని రోగము లంటవు.

## 250

సోమరి, తిండిబోతు,
ప్రపంచమును ద్వేషించువాడు,
మోసములు చేయువాడు, నటుడు
నీ చేతనను బలహీన పరచుదురు.
ఇట్టి వారిని దరి చేరనీయకుము.

## 251

పిసినారి, పొగరుబోతు, మూర్ఖుడు, జూదరి,
అన్యాయమును రక్షించువాడు, దయ లేనివాడు,
కృతఘ్నుడు, పగ తీర్చుకొను స్వభావము కలవాడు
ఇట్టివారి సహాయ సహకారములు కోరకుము.

## 252

రజోగుణ ప్రేరితులను,

మందమతులను,

అసత్యభాషణులను,

విశ్వాసము లేనివారిని,

తమను తాము పొగుడుకొను వారిని,

స్నేహభావము లేనివారిని దరి చేరనీయకుము.

## 253

నీ సహాయమును అర్థించువారి నుండి,
సహాయము నర్థింపకుము.
నీపై ఆధారపడినవారు నీ కాధారము కాలేరు.
వారిని ఆదరముతో చూచుకొనుటయే గాని
వారిపై ఆధారపడుట అవివేకము.

## 254

సంతానముపై ఆధారపడుట దౌర్భాగ్యము.
సంతానమునకు వృద్ధి కలిగించి
తనకు తానుగ జీవించుట గౌరవప్రదము.
చరమ దశయందు ఏకాంతముగ జీవించుట ఉత్తమము.

## 255

జీవ శ్రేయస్సు కొనర్చు కార్యములు,
ఆత్మ తృప్తి కలిగించు కార్యములు,
ఉత్సాహము నినుమడింపజేయు కార్యములు
నిర్వర్తించుట పెద్దలు తెలిపిన సూత్రము.

## 256

జీవితమున శ్రమించుట నేర్చినవానికి
క్రమముగ పనుల యందు నేర్పు కలుగును.
శక్తి, సామర్థ్యము పెరుగుచుండును.
జీవితమున భయముండదు.
సంకల్పమున పవిత్రత కూడ చేరియున్నచో
జీవితము ప్రశాంతము, ప్రవర్ధమానము కాగలదు.

## 257

దుష్టులకు ఎదుటివారి యందలి సద్గుణములు గోచరించవు.
ఎదుటివారి సద్గుణములు వినుటకు కూడ సహింపరు.
సజ్జనులు ఎదుటివారి దుర్గుణములను వినుటకు సహింపరు.
తెలుసుకొనుటకు కూడ ఆసక్తి చూపరు.
తెలిసినను మిన్నకుందురు.

## 258

నిర్మలమగు మనసు నీకున్నచో,
నీ తలపుల యందలి వికృతులు నీవే గమనింపగలవు.
ఇతరులు చెప్పనవసరము లేదు.
మనసున వికృత భావము లున్నపుడు
సుకృత భావములు రుచింపవు.
తెలిపినను ప్రయోజనము లేదు.

## 259

కోరికను ధర్మముతో తూకము వేసి నిర్వర్తించుకొనుము.

ధనముతో తూకము చూచి నిర్వర్తించినచో
పతనము చెందెదవు.

ధర్మముతో కూడిన కోరిక ఉద్ధరించును.

కేవలము ధనముతో కూడిన కోరిక
పతనము గావించును.

## 260

కోపమును, భావావేశమును అదుపు చేయగలవాడు
క్లిష్ట సమయములలో స్థిరముగ నుండగలడు.
ఇతర సమయముల యందు వైభవము పొందగలడు.

## 261

పంచ బలములను తెలిపెదను వినుము.

1. బాహుబలము.
2. పురోహిత బలము.
3. పితృ పితామహ పుణ్యబలము.
4. విద్యా సంపదల బలము.
5. ఆత్మబలము.

ఇవి వరుసగ ఒకదాని కన్న ఒకటి ఎక్కువ బలమైనవి.

## 262

శత్రువును తక్కువ అంచనా వేయుట తగని పని.
కంటకము చిన్నదైనను
అశ్రద్ధ వలన ప్రాణము తీయగలదు.
విషకంటకము, విషదోమ ప్రాణములు తీయుట లేదా!

## 263

విద్యావంతుని ఎడల అహంకరించుట,
భయపడుట, ధనముకై ఆశించుట,
ఇతరుల అభిప్రాయములను నమ్ముట
ఎన్నడును చేయకుము.

## 264

ఉప్పును అమ్మి బ్రతుకుట,
అన్నమును అమ్ముకొని బ్రతుకుట,
విద్యను అమ్ముకొని బ్రతుకుట,
ఎన్నడు చేయదగని పనులు.
ఇది శాసనము.

## 265

సన్యాసి అనగా,

కోపము లేనివాడు,

సమభావము కలవాడు,

దుఃఖము లేనివాడు,

ద్వంద్వములను అధిగమించినవాడు,

శాంత మనస్కుడు.

ఇందేది కఱవైనను అతడు సన్యాసి కాదు.

## 266

ధర్మము ననుసరించువారి బాహువులు సుదీర్ఘములు.
కనులకు కనిపించు బాహువుల కన్న చాల పొడవైనవి.
అతనియం దాచరించు అధర్మము నుండి
తప్పించుకొనుటకు వీలు పడదు.

## 267

కృతఘ్నుల యందు విశ్వాసము చూపని రాజు,
రాజ రహస్యమును ఇతరులకు తెలుపని రాజు,
ఆత్మవిశ్వాసముగల రాజు
అరణ్యమందున్నను గుణపరముగ రాజై యుండును.

## 268

తనపై ఆధారపడువారిని కాచువాడు,
అసూయ లేనివాడు,
ప్రియభాషణము కలవాడు,
ప్రజల ఆదరణ పొందువాడు,
ఎవరి ప్రభావమునకు లొంగనివాడు,
మానవులయందు శ్రేష్ఠుడు.

## 269

స్త్రీ సంపదకు మారు పేరు.

ప్రకృతికి ప్రతిరూపము.

ఆమె గుణ సంపదయే నిజమగు సంపద.

కులస్త్రీని అవమానించినచో

సమస్త సంపదలు హరింపబడును.

అట్టి స్త్రీని భక్తి, ప్రేమ, గౌరవములతో ఆదరించవలెను.

## 270

వివేకవంతుడు సంఘమున వృత్తి నిర్వర్తించుటకు
సహాయకుల నేర్పరచుకొని, సంతానముతో సహా,
సత్పురుషుల నారాధించును.
అట్టి వాని కిహపర బలము కలుగును.

## 271

రాయి యందు లోహము నిహితమై యున్నది.

నీటియందగ్ని నిహితమై యున్నది.

వృక్షమం దంకుర శక్తి నిహితమై యుండి,

నిత్యము పెరుగుదల కావించుచుండును.

సత్పురుషులయందు ధైర్య స్థైర్యములు నిహితమై యున్నవి.

వారితో చెలగాటము అగ్నితో చెలగాటమే.

## 272

విద్యావంతుని యందు విద్య, సద్గుణములు,
సత్ప్రవర్తనము అప్రకటితములై యుండును.
వారు ఉదాసీనులవలె గోచరింతురు.
నివురు నిప్పును గప్పియున్నట్లు,
వారి తేజస్సు వినయమను ముసుగులో నుండును.

## 273

ప్రభువు జీవితము చదరంగము వంటిది.
చదరంగమందు పావులను కదుపు నేర్పు తనకు మాత్రమే
తెలియుట, ఇతరులకు తెలియకుండుట
విజయమునకు కారణము.
అట్లే రాజ నిర్ణయములు కూడ
ఇతరుల మేధస్సుకందని విధముగ నున్నచో,
అట్టి రాజు విజయవంతుడు కాగలడు.

## 274

నిర్వర్తింపబడిన సత్కార్యములను గూర్చి ప్రసంగించ వచ్చును. నిర్వర్తింపబోవు సత్కార్యములను గూర్చి ప్రసంగింపరాదు. సత్కార్యములే తమను తాము ప్రకటించుకొనును గనుక చేతలను గూర్చి ముందుగ మాటాడుట అవివేకము.

## 275

వ్యక్తిగత సలహాదారునకు ఉండవలసిన లక్షణములు రెండు.

1. తెలివి,
2. సన్నిహితత్వము.

ఇందేది కరవైనను అట్టి సలహాదారు
అంతంత మాత్రముగనే ఉపకరించును.

## 276

దైనందినముగ తన మాట, చేత
నిశితముగ పరిశీలించుకొనువాడు,
అందలి మంచిచెడ్డలను నిష్కర్షగ తేల్చుకొనువాడు
జీవితమున క్రమముగ వృద్ధి చెందగలడు.
తన మాటలను, చేతలను తాను లెక్కచేయని వాడైనచో,
తన నిర్లక్ష్యమే తన పతనమునకు కారణమగును.

## 277

జ్ఞానిని జ్ఞానియే గుర్తింపగలడు.
అజ్ఞాని గుర్తింపలేడు.
సద్గుణవతియైన స్త్రీ తన పురుషుని తానే తెలియగలదు.
మేధావంతుడగు మంత్రి రాజును క్షుణ్ణముగ తెలుసుకొనును.
అట్లే రాజ్యమున్నను లేకున్నను, రాజు రాజును గుర్తించును.

## 278

దేవతల పైనను, మహాత్ముల పైనను,
రాజు పైనను, వృద్ధుల పైనను,
పసివారి పైనను కోపించువారు మూర్ఖులు.
వారి కోపము నిష్ప్రయోజనకరము.

## 279

అనుగ్రహమైనను, ఆగ్రహమైనను ఫలవంతములైనచో
నీవు సమర్థుడవుగ గుర్తింపబడుదువు.
అవి నిష్ఫలములైనచో హేళనకు గురికాపడుదువు.
నపుంసకుని భర్తగ నెవ రంగీకరింతురు?

## 280

సంపదకు జ్ఞానాజ్ఞానములు హేతువులు కాదు.
దరిద్రము ననుభవించిన జ్ఞానులు కలరు.
సంపద లనుభవించు అజ్ఞానులు కూడ కలరు.
సంపద ఎట్లు కలుగునో ఎవరికిని తెలియదు.
ఎట్లు పోవునో కూడ ఎవరికిని తెలియదు.
సంపద నాశించుట, బంధించుట అవివేకము.
సంపద సర్వస్వతంత్ర.
మహాలక్ష్మి స్వతంత్రురాలే కదా!

## 281

విద్య, సౌశీల్యము, సంపద
వీటి నపహాస్యము చేయువాడు
పరమ మూర్ఖుడు.

## 282

అజ్ఞానము, అసూయ, తొందరపాటు,
కోపము, దుశ్చర్య
రాబోవు అపాయములకు ముఖద్వారములు.

## 283

వక్రతలేని సహాయము,

మితిమీరని ప్రవర్తన,

సరస భాషణము,

సహకారమునకు ముగ్గురు మిత్రుల వంటివి.

ఈ మిత్రులను పెంచి పోషించుట ప్రధానము.

## 284

వక్రబుద్ధిలేని సమర్థత, కృతజ్ఞత,
ధర్మానుష్ఠాన బుద్ధి, సౌశీల్యము ఉన్నచోట
అనుచరులను కోల్పోవుట యుండదు.

## 285

నియతబుద్ధి, స్థిరచిత్తము, పవిత్రత,
దయగల హృదయము, స్నేహభావము, ప్రియభాషణము,
సంపదలను పెంచగలదు.

## 286

స్వార్థపరుని, సిగ్గులేని వారిని,
కృతఘ్నుని, దుష్టబుద్ధిని, ఆశాపరుని
ఎన్నడును సేవింపకుము.

## 287

పిశాచములవలె వెంట తిరుగువారి కన్న
దూరముగ నున్న సహాయకులు మిన్నయైనవారు.
ఇందు మొదటి తరగతివారు కష్ట కాలమున విడతురు.
రెండవ తరగతివారు కష్టకాలమున నిలతురు.

## 288

పొగడ్తలకు లొంగువారు,
జూదమునందు ఆసక్తి కలవారు,
బట్రాజులను పోగుచేసుకొనువారు,
స్త్రీలకు లొంగువారు
భవిష్యత్తున దరిద్రు లగుదురు.

## 289

అదృష్టము, దురదృష్టము తర్కమున కందునవి కావు.
వానిపై మానవునకు స్వామిత్వము లేదు.
సంపదయైనను, దరిద్రమైనను సమభావముతో స్వీకరించి
జీవించువారు స్థితప్రజ్ఞులు.
వారు కర్తవ్యోన్ముఖులే గాని
సంపదను, దరిద్రమును లెక్కచేయరు.

## 290

వక్రభాషణము

బృహస్పతినైనను

అవమానములపాలు చేయును.

భాషణ మెప్పుడును

హెచ్చరికగ చేయుట ఉత్తమము.

## 291

ప్రియభాషణము చేయువారు ప్రశంసించబడు చుందురు.
ఉదారబుద్ధి కలవారు కూడ ప్రశంసింపబడు చుందురు.
శక్తి సామర్థ్యములు కలవారు,
విద్యావంతులు ప్రశంసింపబడు చుందురు.
వీరందరిని సంఘము ప్రశంసించినను
సత్ప్రవర్తన లేనపుడు సంఘము దూషించుట ఆరంభించును.
సత్ప్రవర్తనమే శాశ్వత కీర్తి నీయగలదు.

## 292

నచ్చిన మనుషులయందు లోపము లున్నను కనపడవు.
నచ్చని మనిషియందు సద్గుణము లున్నను గోచరింపవు.
ఇష్టాయిష్టములతో చూచువారు
రెండు కన్నులూ లేని కబోధులు.
వారికి యథార్థ మెప్పుడును గోచరించదు.

## 293

వక్రమార్గమున వృద్ధి చెందినవారు-

పతనము చెందుట తథ్యము.

సక్రమ మార్గమున భిక్షాటనము చేయుటలో గల శ్రేయస్సు

పైవారి కుండదు.

ఇందు మొదటివారు ఇహపరములను కోల్పోవుదురు.

రెండవవారు క్రమముగ ఇహపరములను పొందుదురు.

## 294

శ్రమఫలముగ సంపద కలిగినచో
అట్టి సంపద దుఃఖమును కలిగించదు.
కలిగిన సంపద దుఃఖము నిచ్చినచో
అది సత్సంపద కానేరదు.
కొందరు ధనముచే సంపన్నులు.
మరికొందరు గుణముచే సంపన్నులు.
ఇందు మొదటివారికన్న రెండవవారు మిన్న.
వారి నాశ్రయించుట శ్రేయస్కరము.

## 295

ధర్మానుష్ఠానబుద్ధి గలవారు
అధర్మమును అరికట్టుటకు కూడ ప్రయత్నింతురు.
ఉదాశీనులై యుండరు.
అధర్మము ఎడల ఉదాశీనత అధర్మమే యగును.

## 296

హింస, దూషణముగల చోట యుండరాదు.
అట్టి వారికి సుదూరముగ నుండవలెను.
అట్టి వారినుండి ఎప్పుడును,
ఎట్టి సహాయము అర్థించరాదు.
దూషణము, హింస కలి ధర్మములు.

## 297

అవినీతి
సమీపమున నున్నవారిని కూడ
అనుమానింప జేయును.
అవినీతిపరున కెప్పుడును
దూరముగ నుండుము.

## 298

దుష్టులు బాధించి సంతసింతురు.
మనుగడను రూపుమాపి సంతృప్తి చెందుదురు.
ఎదుటివాని మనుగడయే కిట్టనివారు నిజమగు దుష్టులు.

## 299

పేదలను, బలహీనులను, అనాథలను,
అస్వస్థులను కాచువారు
కలకాలము సంతానముతో సహా
వృద్ధి నొందుదురు.

## 300

బంధువులకు, స్నేహితులకు
చేతనగు సహాయము ఎప్పుడును
చేయుచు నుండుము.
వారి పాత్రతను గురించి ప్రశ్నించవలదు.
దీర్ఘకాలమున దీని ప్రయోజనము తెలియగలదు.

## 301

నీవు సుఖముగ నుండదలచినచో
నీ పరివారము సుఖమునకు కూడ తోడ్పడుము.
దుఃఖమయమగు పరివారము కలవాడు సుఖింపలేడు.

## 302

దీర్ఘ కాలమున దుఃఖములు కలిగించు కార్యములను
ప్రస్తుత సౌఖ్యము ననుసరించి చేయరాదు.
అట్లు చేసినచో పతనము తప్పదు.
పశ్చాత్తాపము ఒక్కటియే పరిష్కారమై నిలచును.

## 303

చెవిటివానితో భాషించి ఉపయోగమేమి?
విముఖుడగు విద్యార్థికి విద్య నేర్పుటలో వివేకమేమి?
వినని వానికి సలహాలిచ్చుటలో విజ్ఞత ఏమి?

## 304

దుఃఖఫలములను కలిగించు కార్యములను
నిర్వర్తించుట దురదృష్టము.
మీమాంస లేని వానికి మిగులునది దుఃఖమే.

## 305

అహంకారము, గర్వము, అశ్రద్ధ, అతినిద్ర,
తెలివితక్కువ దూత, అప్రమత్తులు కాని సహచరులు
వైఫల్యములకు ముఖద్వారములు.

## 306

విద్య, వినయము, సంపద స్థిరముగ కలుగవలె నన్నచో
పెద్దలను చేరి శుశ్రూష చేయవలెను.
వారుపదేశించిన మార్గమున స్వాధ్యాయము చేయవలెను.
అట్లు కానిచో విద్యా సంపదలు అస్థిరములై యుండును.

## 307

తపన లేనివానికి జ్ఞానము నందించుట,

అడగని వానికి సలహా నిచ్చుట,

సముద్రమున మునిగిన ఉంగరమును వెతకుట,

వృథా ప్రయాసయే.

## 308

దీర్ఘకాలికమైన కార్యమేదైన చేయునపుడు
స్వానుభవము, తదనుగుణమైన జ్ఞానము,
పెద్దల సలహాలు, సంకల్పబలము,
ఆత్మావలోకనము మరువకుము.
వీనిని పాటించినపుడు ప్రయత్నము సుగమ మగును.

## 309

వినయ మున్నచోట అవమానముండదు.
ధైర్య మున్నచోట ఘర్షణ యుండదు.
ఓర్పు ఉన్నచోట కోపముండదు.
సత్ప్రవర్తన మున్నచోట అసంవృద్ధి యుండదు.

## 310

ఒక వ్యక్తిని తెలియవలెనన్నచో
ఈ క్రింది విషయములు పరిశీలించవలెను.

1. పుట్టుక – పుట్టిన విధానము.
2. పితృ పితామహ సంస్కారములు
3. ఆహారపు టలవాట్లు
4. వస్త్రధారణ
5. అనుయాయులు
6. సమీకరింపబడిన వస్తువులు
7. భాషణము.

# 311

దేహాత్మభావము దాటినవారు
దేహ సౌఖ్యములకై ప్రయత్నింపరు.
ఆత్మ సౌఖ్యమే వారి సౌఖ్యము.

## 312

సత్యభాషణ మొనర్చువానిని,
సత్కర్మాచరణము కలిగిన వానిని,
అంగబలము గలవానిని,
ప్రశంసనీయమైన ప్రవర్తన గలవానిని,
చేరదీయుట శ్రేయస్కరము.

## 313

జాతినిబట్టి ఎన్నడును గుణ మెన్నకుము,
జాతి ఎట్టిదైనను గుణమున్నవాడే శ్రేష్ఠుడు.
సాధు సజ్జనులను పోషించువాడు శ్రేష్ఠుడు.
సంఘ శ్రేయస్సుకు తోడ్పడువాడు శ్రేష్ఠుడు.
అట్టివా రేజాతియందు పుట్టినను శ్రేష్ఠులే.

## 314

స్నేహమునకు విశ్వాసము ప్రాణము.
విశ్వాసమునకు ఆత్మయే  ప్రమాణము.
మనోబుద్ధులు ప్రమాణము కాదు.

## 315

విచక్షణ లేనివాడు,
సంకల్పమున పవిత్రత లేనివాడు,
పారదర్శకమైన హృదయము లేనివాడు-
స్నేహమునకు అనర్హుడు.

## 316

అహంకారులతోను,
గర్వబోతులతోను,
కోపిష్ఠులతోను,
తొందరపాటు కలవారితోను,
శ్రద్ధ లేనివారితోను స్నేహము చేయరాదు.

## 317

ఋజుప్రవర్తనము, కృతజ్ఞత,
నిజాయితి, నీతి, స్థిరత్వము,
సాహసము, ప్రేమ గలవానితో
స్నేహము చేయుట ఉత్తమము.

## 318

ఆత్మనిగ్రహము
మరణమును జయించుట కన్న గొప్పది.

# 319

పొరుగువారి విషయములో జోక్యము కల్పించుకొనుట
దేవతలకు కూడ, కూడని పని.

## 320

నిజాయితీపరులు సర్వమూ కోల్పోయినను
నిజాయితీని వీడరు.
నిజాయితీతోనే
మరల సర్వ సంపదలను పొందుదురు.

## 321

జీవిత గమ్యమునకు
అప్రమత్తత అత్యంత ప్రధానము.
పూర్వ ఉత్తర మీమాంసలు
అట్టివానికి అధిదేవత,
ప్రత్యధిదేవతలై యుండవలెను.

## 322

నీ వే భావము నెక్కువగ ధరింతువో
ఆ భావమే నిన్ను ధరించుట ప్రారంభించును.
నీవు నిర్మించిన భావమే నిన్ను కట్టడి చేయగలదు.
భావము దివ్యమైనచో, దివ్యముగ ప్రకాశింతువు.
భావము మలినమైనది అయినచో
క్రమముగ పతనము చెందుదువు.

## 323

సద్భావము కలవారితో
సంగము మాత్రమే సత్సంగములు.
సద్భావము లేని సత్సంగము
నేతి బీరకాయలోని నేయి వంటిది.

## 324

మానవుడు ప్రయత్నించి
సాధింపలేనిది ఏమియును లేదు.
అతడు సహజముగ దివ్య సంకల్పము గలవాడు.

## 325

సమర్థునకు సహనము కూడ యున్నచో
కీర్తిమంతుడు కాగలడు.
సహన మతనికి మకుటము వంటిది.

## 326

ధర్మమునకు హాని కలుగని భోగమును
అనుభవించుట ధర్మమే.

## 327

సద్భావము లేనిచోట సంపద నిలువదు.
ధర్మమును, కర్మమును విశ్వసింపని చోట కూడ
సంపద నిలువదు.
సోమరితన మున్నచోట కూడ
సంపద నిలువదు.

## 328

సాధు స్వభావము గలవారిని
దుర్భలురుగ భావించుట అజ్ఞానము.
దుష్టులు సాధుజనుల బలమును గర్తింపలేరు.

329

మితిమీరిన సాహసమును ప్రదర్శించువారు
సమస్తమును కోల్పోవుటకు అవకాశ మెక్కువ.

## 330

సంపదను నిలుపుకొనుటకు ప్రయత్నింపకుము.
అది పిచ్చియావు వంటిది.
సంపద నిలుచుటకు దాన ధర్మాదులే ప్రధానము.

## 331

సంపదకు సద్వినియోగము

1. దానము, 2. దివ్యారాధనము, 3. భోగము.

సద్గ్రంథమునకు సద్వినియోగము

1. పరివర్తనము, 2. వికాసము, 3. అనుభూతి.

## 332

అక్రమార్జన
సత్కార్యములకు వినియోగపడదు.
సద్వినియోగ అర్హత అక్రమార్జనకు లేదు.

## 333

ప్రశాంతచిత్తులు క్లిష్ట సమయములందు చెదరరు.
రాబోవు అపాయమును గూర్చి బెదరరు.
అదురు బెదురు లేక ధర్మము నాశ్రయించుచు జీవింతురు.

## 334

సన్యాసికి తపస్సు బలము.
మనిషికి ఆత్మ బలము.
గుణవంతునికి ఓర్పు బలము.
దుష్టునికి హింస బలము.
దీక్షాయుతునకు సద్గురువునందు భక్తి,
పాలు, పండ్లు, కందమూలములు,
నీరు సిద్ధికి సహకరణములు.

## 335

సూక్ష్మముగ ధర్మ మెరుగదలచినచో
ఈ వాక్యమును పాటించుము.
ఇతరులు నీ కేమి చేసిన బాగుండదో
అది నీవు యితరులకు చేయకుము.

## 336

కోపమునకు శాంతము విరుగుడు.

దుర్భావమునకు జ్ఞానము విరుగుడు.

పిసినారికి దానము విరుగుడు.

అసత్యమునకు సత్యము విరుగుడు.

ప్రశాంతత, జ్ఞానము, ధ్యానము, సత్యము

ఆశ్రయించు వానికి కోపము, దుర్భావము, పిసినారితనము,

అసత్య ప్రవర్తనము క్రమముగ తొలగును.

## 337

స్త్రీల నవమాన పరచువాడు,
సోమరిపోతు, పిరికివాడు, కోపిష్ఠి,
గర్వపోతు, దొంగ, కృతఘ్నుడు
ఎప్పటికిని నమ్మదగినవారు కారు.
వారిపై విశ్వాసముంచుట అవివేకము.

## 338

పెద్దలను గౌరవించువాడు,
సద్గురువులను పూజించువాడు,
వారికి సేవలు చేయువాడు
ఆయుష్షు, కీర్తి, బలములను పొందును.

## 339

శక్తికి మించిన లక్ష్య మేర్పరచుకొన్నచో
లక్ష్యసాధనకు దైవము, ధర్మము తోడుగ రావలెను.
అంతియేకాని
లక్ష్య సాధనకు తప్పుడు దారులు ఎంచుకొనుట,
దుర్మార్గులతో స్నేహము చేయుట,
కుతంత్రముల నాశ్రయించుట తగని పని.
అట్లైనచో నాశనము తప్పదు.

## 340

చదువు రానివాడు,
కుటుంబమునందు కలతలు గలవాడు,
అన్నవస్త్రాదులతో సంతానమును పోషించ లేనివాడు,
రాజ్యము లేని రాజు అత్యంత దయనీయులు.
వారి దీనత్వము నుండి ఉద్ధరింపబడుటకు చేయు
ఏ సహాయమైనను ఉత్తమ పుణ్యకార్యమే అగును.

## 341

మితిమీరిన ప్రయాణములు దేహమునకు చేటు.
మితిమీరిన నదీ ప్రవాహము ఒడ్డునకు చేటు.
మితిమీరిన వాక్ ప్రవాహము మనస్సునకు చేటు.

## 342

ఆచరణ శూన్యత జ్ఞానమునకు మృత్యువు.
నిగ్రహలేమి జ్ఞానికి మృత్యువు.
అసత్య భాషణము మనిషికి మృత్యువు.
పరిత్యజింపబడుట స్త్రీకి మృత్యువు.
మితిమీరిన కోరిక అందరికిని మృత్యువే.

## 343

బంగారము నుండి వెండి పుట్టును.
వెండి నుండి రాగి పుట్టును.
రాగి నుండి సీసము పుట్టును.
సీసము నుండి మలము పుట్టును.
భావనలిట్లు ఐదు విధములు!

## 344

అగ్నికి నేయి,
త్రాగుబోతుకు మద్యము,
సోమరికి నిద్ర
అమిత ప్రీతిని కలిగించును.
పొందినకొలది వానియందు
కోరిక పెరుగునే గాని తరుగదు.

## 345

సమర్థుడు స్నేహితునితో పంచుకొనును.
కుటుంబమునకు సమృద్ధి కలిగించును.
శత్రుత్వములను పరిష్కరించుకొనును.

## 346

సహకారము ప్రకృతి యందు సహజము.
చెప్పులు కుట్టువాడు గాని, మంగలిగాని,
కుమ్మరిగాని, వ్యాపారిగాని, సైనికుడుగాని,
రాజుగాని, బంటుగాని– ఎవ్వరైనగాని,
ఒకరికొకరు సహకరించినపుడే జీవనము సాగును.
పరస్పర సహకారమే జీవనమున కాధారము.
తన పొట్టను మాత్రము తాను నింపుకొనువాడు
పూర్ణమైన అజ్ఞాని.

## 347

భూమియందలి ఏ సంపదకూడ
విద్యావంతునితో సరితూగ లేవు.
రాజ్యము, ధనము, సంపద, పాడి, పంట, అంగబలము–
ఇత్యాది వెన్ని కలిగినను
అట్టివాడు విద్యావంతునితో సముడు కాలేడు.
విద్యావంతుని యెడల పూజ్యభావము మంగళప్రదము.

## 348

రాజునకు తన సంతానమే కాక
సర్వప్రజలు కూడ సంతానమై నిలతురు.

తన సంతాన సౌఖ్యమునకు ఏమి కావలయునో
అట్టి సౌఖ్యము ప్రజలకు కూడ నేర్పరచువాడు
నిజమగు రాజు.

అట్టి వాని పాలన ప్రజలకు మోదము కలుగును.

ప్రజలు కూడ ఆమోదము తెలుపుదురు.

## 349

విద్యావంతుడు ప్రశంసల కొరకు ఏ పనియు చేయడు.
ప్రశస్తమగు కార్యములు చేయుటయే
దీక్షగ అతడు జీవించును.
ప్రశంశలు కీర్తి ప్రతిష్ఠ నీడవలె అతని ననుసరించును.

## 350

ప్రశంస యున్నచోట విమర్శకూడ యుండును.
ప్రశంస కోరువాడు విమర్శనుకూడ ఎదుర్కొనవలసి వచ్చును.
ప్రశంసలను కోరనివాడు విమర్శలకు కూడ అందడు.
ప్రశంస – విమర్శ నాణెమునకు
బొమ్మ – బొరుసు వంటివి.

## 351

నీకు ప్రీతి కలిగించు భావ మధర్మ మైనపుడు
దానిని తక్షణమే విసర్జించవలెను.
సర్పము తనకు ప్రీతిపాత్రమగు దేహ పొలుసును
కాలానుగుణ్యముగ విసర్జించి ముందుకు సాగును.
నీవును అధర్మ భావమునట్లే విసర్జించి
ప్రకాశముతో ముందుకు సాగుము.

## 352

మోసముతో పొందిన విజయము నీచము.
పిసినారి యగు రాజు నీచుడు.
జ్ఞానిని హింసించుట అతినీచము.
ఇట్టి నీచ కార్యములకు నిష్కృతి లేదు.

## 353

ఆత్మస్తుతి అజ్ఞానము.
వివేకము లేని ఆలోచన, ఆచరణ మరింత అజ్ఞానము.
పెద్దలను సేవింప నిరాకరించు మనసు
ఘోరమగు అజ్ఞానముతో కూడియున్నదని తెలియుము.

## 354

పురోగతి కోరువారు ఈ క్రింది ఆటంకములను
ఓర్పుతో నిర్మూలించుకొనవలెను.

1. అలసత్వము,
2. గర్వము,
3. పొరపాటు,
4. చంచలమైన మనసు,
5. మార్పుకు అంగీకరించని బుద్ధి,
6. అహంకారము,
7. మమకారము,
8. మోహము.

## 355

విద్యా సముపార్జనకు సౌకర్యము అడ్డుగోడ.
సౌకర్యము కోరువారు విద్యను పొందలేరు.
వ్యక్తిగత సౌకర్యము, విద్య ఒకదాని కొకటి విరుగుడు.

## 356

అత్యాస మనోశాంతిని చెరచును.
కాలము దేహమును చెరచును.
కోపము సంతతిని చెరచును.
పిసినారితనము కీర్తిని చెరచును.
అప్రమత్తత లేమి పాడిపంటలను చెరచును.
జ్ఞాని కోపము దేశమునే చెరచును.

## 357

గృహస్థు గృహమునందు
ఈ వస్తు సంపదను సమకూర్చుకొన్నచో
గృహము శోభించును.
1. పాడి, 2. గంధము, 3. వీణ, 4. అద్దము. 5. తేనె,
6. నేయి. 7. లోహము, 8. రాగి పాత్ర, 9. శంఖము,
10. పవిత్రమగు శిల, 11. ఆవు పేడ.
పై వస్తువులు దేవతారాధనకు, సద్గురువు ఆరాధనకు,
అతిథుల ఆరాధనకు తోడ్పడును.

## 358

అమితమగు కోరిక కలిగినను,

భయము కలిగినను,

మోహము కలిగినను,

ప్రాణభీతి కలిగినను,

ధర్మమును మాత్రము విడువకుము.

## 359

ఆత్మ, ధర్మము సనాతనులు.
ధర్మము నాశ్రయించి ఆత్మ తత్త్వము నెరుగుము.
అపుడు తృప్తి, సంమృద్ధి ఏర్పడగలవు.
ధర్మమును వీడినచో ఆత్మ మరుగున పడును.
అపుడు స్వభావమున శాశ్వతముగ బంధింప బడుదురు.

## 360

దేహము వదలినపుడు నీకు తోడుగ వచ్చునవి
నీవాచరించిన ధర్మాధర్మములే.
రాజ్యముగాని, సంపదగాని, అంగబలముగాని,
భార్యాపిల్లలు కాని కీర్తి ప్రతిష్ఠలుగాని వెంటనంటి రావు.
ఎట్టి సమయమునందు కూడ
ధర్మమును వీడకుండుట నిజమగు తెలివి.

## 361

మనస్సునకు బుద్ధియను వెలుగు ఆధారము.
మనసును బుద్ధిపై నుంచినచో
జ్ఞానమయమగు వెలుగులోకములయందు చరింతువు.
ఇంద్రియములు, శరీరము, బాహ్యప్రపంచము
మనసునుండి మానవుడు గ్రహించును.
బుద్ధితో కూడిన మనసునకు బాహ్యమంతయు
ఇంద్రజాలమని తెలియును.
బుద్ధితో కూడనపుడు ఇంద్రజాలము ఆవరించును.

## 362

నీవు సత్యము. నీ జీవనము ఒక ప్రయాణము.
నీ ప్రయాణమునకు గమ్యము నీవు సత్యమని తెలియుటయే.
సత్యము తెలిసినపుడు ఇతరముండదు.
ఇతరము లేనపుడు విరుద్ధభావమే యుండదు.
విరుద్ధ భావము జీవన ప్రయాణమునకు ఆటంకము.
ఆటంకము కారణముగ ప్రయాణ మాగును.
సత్యమును చేరనపుడు మిగిలినది మృత్యువే.

## 363

మహత్కార్యములను చేయునపుడు
ధర్మమును, ఆత్మ ప్రబోధమును, సద్గురువును
సంప్రదించి పూనుకొనవలెను.

## 364

దైవభక్తి కలవాడు

తాత్కాలికముగ సర్వము కోల్పోయినను

మరల వైభవమును పొందును.

## 365

దైవము, ధర్మము, ఓర్పు,
సహనము, మౌనము, అనసూయత్వము,
పెద్దల యందు పూజ్యభావము
కలవానిని ఎవ్వరును ఎదిరించి నిలువలేరు.

## 366

నీ ఉదరమును, జననేంద్రియమును
సంకల్పముతో కాపాడుకొనుము.
దేహమును కంటితో కాపాడుకొనుము.
కన్ను చెవులను మనసుతో కాపాడుకొనుము.
మనసును సద్భావముతో కాపాడుకొనుము.
సద్భావమును సత్పురుషుల సమాశ్రయణముతో
కాపాడుకొనుము.

## 367

నిత్యము స్నాన మాచరించువాడు,
నిత్యము సమయమును పాలించుచు
దైవము నారాధించువాడు,
నిత్యము పవిత్ర గ్రంథములను పఠించువాడు,
అపవిత్రమగు ఆహారము స్వీకరించనివాడు,
భాషణ యందు త్రికరణశుద్ధి కలవాడు,
పరహితము నొనర్చువాడు ఎన్నడును పతనము చెందదు.

## 368

ఇతరుల శ్రేయస్సు కొరకు
బలహీనుల కొరకు
ధర్మము కొరకు
సత్పురుషుల కొరకు
సత్కార్యముల కొరకు
చేయు త్యాగము
వెలుగులోకములకు ద్వారములను తెరచును.

## 369

వ్యాపార మెట్టిదైనను
అది జీవహితమును గూర్చి నిర్వర్తించినదైనచో
వ్యాపారి సంస్కరింపబడును.
లేనిచో పతనము చెందును.
సేవకుడైనను తన విద్యుక్త ధర్మమును
నిస్వార్థముగ నిర్వర్తించినచో ఊర్ధ్వగతి చెందును.

## 370

సర్వభూత హిత రతియే సృష్టి కార్యము.
అందు పాల్గొను జీవులు కూడ దానినే అనుసరించినపుడు
ఉద్ధారణము తప్పక జరుగును.

## 371

స్వార్థము కొరకు, స్వలాభము కొరకు,
కామ పరితృప్తి కొరకు
ధర్మమార్గమును వీడకుము.
జీవశ్రేయస్సే నీ శ్రేయస్సు.
అట్లు జీవించినచో క్రమముగ తరింతువు.

## 372

సద్గుణములు, సత్కర్మాచరణము, సదాచారము
నీ కొరకే గాని,
నిన్ను నీవు ప్రచారము చేసుకొనుటకు కాదు.
ఆచరణమే నిజమగు ప్రచారము.

## 373

నీవు చేయు పని ఎంత గొప్పదియైనను
అది నీయందు ఘర్షణ పెంచుచున్నచో వెంటనే విసర్జించుము.
అంతరంగమున ఘర్షణము కలిగించు కార్యము
వైభవముతో కూడినదైనను వదలవలెను.
అట్టి కార్యము స్వధర్మమునకు విరుద్ధము.

## 374

ప్రాణముకన్న ధర్మము ప్రధానము.
ధర్మము కొరకు ప్రాణము విడచినచో
ఉద్ధారణము జరుగును.
ప్రాణము కొరకు ధర్మము విడచినచో
పతన మవశ్యము.

## 375

నీవు ధర్మము పాటించినచో
ధర్మము నిన్ను సర్వత్ర రక్షించును.
ఇది సృష్టియందన్ని లోకములందు సత్యము.
ధర్మమే సృష్టియందు దైవము.
ధర్మ మాచరించిన వారికే
దైవస్వరూపము తెలియగలదు.
దైవదర్శనము కూడ కాగలదు.
ధర్మమును మించినదేదియు లేదు.

# OTHER BOOKS THROUGH MASTER K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

| | | |
|---|---|---|
| 1. | Agni (E/G/S) | 60-00 |
| 2. | Amanaskudu (T/K) | 18-00 |
| 3. | Antardarsana Dhyanamulu (T) | 100-00 |
| 4. | Anveshakudu (T) | 60-00 |
| 5. | Asangudu (T) | 15-00 |
| 6. | Ashram Leaves (E/G/S) | 100-00 |
| 7. | Ayurvedic Principles (E) | |
| 8. | Bharateeya Sampradayamu (T/Hi) | 10-00 |
| 9. | Cow (‘Govu’ Mahatyam Vivarana) (E/T/K) | 20-00 |
| 10. | Devapi Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 11. | Dhanakamuni Katha (T) | 25-00 |
| 12. | Doctorine of Eternal Presence (E) | 10-00 |
| 13. | Gayatri Mantra - Avagahana (T) | 10-00 |

| | | |
|---|---|---|
| 14. | Geetopanishad - Gnana Yogamu (T) | 25-00 |
| 15. | Geetopanishad - Karma Yogamu (T) | 20-00 |
| 16. | Geetopanishad - Sankhya Yogamu (T) | 25-00 |
| 17. | Geetopanishad - Karmasanyasa Yogamu (T) | 20-00 |
| 18. | Good Friday (E/G/S/F/H) | 10-00 |
| 19 | Gurupaduka Sthavam (E) | |
| 20. | Health & Harmony (E) | 120-00 |
| 21. | Hercules-The Man and the Symbol (E/G/S/F) | 100-00 |
| 22. | Himalaya Guru Parampara (T/Hi) | 12-00 |
| 23. | Jupiter-The Path of Expansion (E/G/S) | 40-00 |
| 24. | Jyotirlinga Yatra (T) | 20-00 |
| 25. | Katha Deepika (T) | 40-00 |
| 26. | Listening to Invisible Master (E/G/S/F/H) | 20-00 |
| 27. | Lord Maitreya-The World Teacher (E/G/S/F/H) | |
| 28. | Maitreya Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 29. | Mana Mastaru Garu (T) | 60-00 |
| 30. | Mantrams-Their Significance and Practice (E/G/S) | 35-00 |
| 31. | Maria Magdalena (E/S/G/F) | |
| 32. | Marriage-A Sacrament (E) | |

| | | |
|---|---|---|
| 33. | Maruvu Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 34. | Master C.V.V. (Birthday Message) (T) | 30-00 |
| 35. | Master C.V.V. Noothana Yogamu (T) | 20-00 |
| 36. | Master C.V.V. Yogamu (T) | 20-00 |
| 37. | Master C.V.V. Yogamu-Karma Rahityamu (T) | 10-00 |
| 38. | Master C.V.V. - May Call !(E/G/S) | 100-00 |
| 39. | Master C.V.V. - May Call ! II (E) | 100-00 |
| 40. | Master C.V.V. The Initiator - Master E.K. The Inspiror (E) | 15-00 |
| 41. | Master C.V.V. - Saturn Regulations | 125-00 |
| 42. | Master E.K. - The New Age Teacher (E/G/S) | 70-00 |
| 43. | Mithila-A New Age Syllabus (E/G/S) | 100-00 |
| 44. | Occult Meditations (E/G/S) | 100-00 |
| 45. | Omkaram (T) | 30-00 |
| 46. | On Change (E/G/S) | 50-00 |
| 47. | On Healing (E/G/S) | 100-00 |
| 48. | On Love (E/G/S) | 50-00 |
| 49. | On Service (E/G/S) | 50-00 |
| 50. | On Silence (E/G/S) | 50-00 |
| 51. | Pranayamam (T) | 10-00 |

| | | |
|---|---|---|
| 52. | Prayers (E/G/S) | 100-00 |
| 53. | Rudra (E/G/S) | 30-00 |
| 54. | Sankhya - The Sacred Doctrine (E/G/S) | 75-00 |
| 55. | Saraswathi - The Word (E/G/S) | 60-00 |
| 56. | Saturn-The Path of Systematised Growth (E/G/S) | 40-00 |
| 57. | Shodasopachara Pooja - Avagahana (T) | 10-00 |
| 58. | Sound-The Key and its Application (E/G/S) | 40-00 |
| 59. | Spiritualism - Business and Management (E/G/S) | 25-00 |
| 60. | Sri Dattatreya (E/G/S/T/Hi) | 33-00 |
| 61. | Sri Gurupaduka Sthavam (T) | 30-00 |
| 62. | Sri Krishna Namamrutham (T) | 25-00 |
| 63. | Sri Lalitha-1 (T) | 40-00 |
| 64. | Sri Lalitha-2 (T) | 40-00 |
| 65. | Sri Lalitha-3 (T) | 40-00 |
| 66. | Sri Lalitha-4 (T) | 40-00 |
| 67. | Sri Sastri Garu (E/G/S/F/T/H) | 40-00 |
| 68. | Sri Shiridi Sai Sayings (E/G/S/T/Hi) | 80-00 |
| 69. | Steps on Silence (E) | 75-00 |
| 70. | Suvarna Sopanamulu | |
| 71. | The Aquarian Cross (E/G/S) | 100-00 |

## BOOK LIST

| | | |
|---|---|---|
| 72. | The Aquarian Master (E/G/S) | 75-00 |
| 73. | The Doctorine of Ethics (E) | 35-00 |
| 74. | The Etheric Body (E/G/S) | |
| 75. | The Path of Synthesis (E) | 40-00 |
| 76. | The Splendor of Seven Hills (E/T/Hi) | 15-00 |
| 77. | The Teachigs of Lord Sanatkumara | 150-00 |
| 78. | The Theosophical Movement (E/G/S) | 60-00 |
| 79. | The White Lotus (E/G/S) | 20-00 |
| 80. | Time - The Key (E/G/S) | |
| 81. | Uranus - The Alchemist of the Age | 150-00 |
| 82. | Venus - The Path of Immortality (E/G/S) | 80-00 |
| 83. | Violet Flame Invocation (E/G) | 60-00 |
| 84. | Vrutrasura Rahasyam (T) | 35-00 |
| 85. | Varunagraha Prabhavamu (T) | 22-00 |
| 86. | Wisdom Buds (E/S) | 20-00 |
| 87. | Wisdom Teachings of Vidura (E/G/S) | 80-00 |
| 88. | Moon & Spiritual Astrology (S) | |
| 89. | The Death & Reincarnation (S) | |
| 90. | Commentary on Om Namonarayanaya (S) | |
| 91. | Master Jesus, Life and Teachings (S) | |

92. The Science of Ayurveda & Homoeopathy (S)
93. The Teachings of Master D.K. (S)
94. The Human Constitution (S)
95. The Masters of Wisdom (S)
96. The Path of Meditation (S)
97. Stories for Disciples (S)
98. Spirituality in Daily Life (S)
99. Special Practices for Disciples (S)
100. Fundamentals of Health & Healing (S)
101. Ganesha, The Cosmic Lord of Groupings (S)
102. Astrology and Healing (S)

BOOK LIST

## DHANISHTA OTHER PUBLICATIONS

| | | |
|---|---|---|
| 1. | Puranapurushuni Pooja Vidhanam (T) | 10-00 |
| 2. | Sarannavaratra Pooja Vidhanamu (T) | 30-00 |
| 3. | Sri Dattatreya Pooja Vidhanamu (T) | 10-00 |
| 4. | Sri Hanuman Chalisa (T) | 15-00 |
| 5. | Sri Mahalakshmi Pooja Vidhanamu (T) | 12-00 |
| 6. | Sri Rama Pooja Vidhanamu (T) | 10-00 |
| 7. | Sri Siva Hridayamu (T) | 5-00 |
| 8. | Sri Siva Pooja (T) | 15-00 |
| 9. | Sri Soukumarya Satakam (T) | 10-00 |
| 10. | Sri Surya Pooja Vidhanamu (T) | 7-00 |
| 11. | Sri Venkateswara Pooja Vidhanamu (T) | 8-00 |
| 12. | Vinayaka Vratakalpamu (T) | 25-00 |
| 13. | Vishnu Sahasranamam (T) | 12-00 |